
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.90 (311.7462)	1,00,979	1,00,979
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,137.95	633.70
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.587 (43.5968)	82,320	1,30,542

చికెన్ ధరలు	లైవ్ : రూ.125	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.220

తిప్పర్తి వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయరహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు



యూరియా కష్టాలు అలాగే..

యూరియా కోసం రైతుల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. సహకార సంఘాలు, ఎరువుల దుకాణాలు, రైతువేదికల వద్ద రైతులు యూరియా కోసం గంటల తరబడి లైన్లలో నిలబడుతున్నా ఫలితం దక్కడం లేదు. జిల్లాకు వచ్చిన యూరియా వచ్చినట్లే ఇస్తున్నా అవసరాలు తీరని పరిస్థితి నెలకొంది. ప్రతీ బస్తా రైతుకు చేరేలా మానిటరింగ్ వ్యవస్థ కొనసాగిస్తున్నామని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నా, బ్లాక్ మార్కెట్ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో యూరియా బ్లాక్ మార్కెట్ కట్టడికి పోలీస్‌శాఖ టాస్క్‌ఫోర్స్‌ను సైతం రంగంలోకి దించింది. యూరియా పక్కదారి పట్టకుండా రైతులకు టోకెన్ విధానంలో అందిస్తున్నామని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- ఆయకట్టుకు ఈ 10 రోజులే కీలకం
- పంపిణీలో ఇక్కట్లు ఎదురవకుండా టోకెన్ల విధానం
- ముందస్తు జాగ్రత్తలు లేకపోవడం వల్లే బ్లాక్‌మార్కెట్‌లో ఎరువులు
- రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్

జిల్లాలో వానాకాలం సీజన్‌లో పత్తి, వరి పంటలకు యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుంది. జిల్లాలో పత్తికి ప్రస్తుతం యూరియా వినియోగం పూర్తిగా తగ్గిపోగా, వరికి బోరుబావుల కింద, చెరువుల కింద సాగైన చోట్ల ఇప్పటికే యూరియా అవసరం తీరింది. సాగర్ ఆయకట్టు కింద నెలక్రితం వరినాట్లు పూర్తవడంతో వరికి యూరియా అందించాల్సిన దశ కొనసాగుతోంది. మరో 10 రోజుల వరకు ఆయకట్టులో యూరియా వినియోగం ఉంటుంది. అందుకే ప్రస్తుతం ఆయకట్టులో యూరియా కోసం రైతులు దుకాణాలు, సొసైటీల వద్ద నిరీక్షిస్తున్నారు. జిల్లాకు ఈ సీజన్‌లో అన్ని పంటలకు కలిపి సెప్టెంబరు నెలాఖరు నాటికి 70వేల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరం ఉంటుందని భావించగా, ఇప్పటికే 60వేల మెట్రిక్‌టన్నుల యూరియాను పంపిణీ చేశారు. ఈ నెలలో మిగిలిన 10వేల మెట్రిక్‌టన్నుల యూరియా కూడా వస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే జిల్లా అవసరాలకు ఇంకో 6వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియా అవసరమవుతుందని, అదనపు కేటాయింపు చేస్తే తప్ప రైతుల అవసరాలు తీరవనే అభిప్రాయం వెల్లడవుతోంది. జూన్, జూలై నెలల్లో యూరియా విక్రయాలపై నియంత్రణ లేకపోవడంతో జిల్లా కోటాలో వచ్చిన యూరియా సైతం ఏపీలోని సరిహద్దు జిల్లాలకు విక్రయించారని, అందుకే ప్రస్తుతం కొరత తీవ్రమైందని తెలుస్తోంది.

టోకెన్ల విధానం అమలు

జిల్లాలో యూరియా కోసం రైతుల ఆందోళనలు రోజురోజుకూ ఉధృతమవుతుండడంతో కలెక్టర్ సూచనల మేరకు వ్యవసాయాధికారులు

- మిగతా 6వ పేజీలో...

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

జిల్లాలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా నియంత్రించేందుకు పోలీస్‌శాఖ రంగంలోకి దిగింది. ఎస్పీ శరత్‌చంద్రపవార్ సూచనల మేరకు టాస్క్‌ఫోర్స్ విభాగం పోలీసులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి జిల్లాలో విస్తృతంగా ఎరువుల దుకాణాల తనిఖీలు నిర్వహించారు. నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, కొత్తపల్లి, గుర్రంపోడు ప్రాంతాల్లో పదికిపైగా ఎరువుల దుకాణాలను తనిఖీలు చేసి స్టాకుల వివరాలు పరిశీలించారు. గుర్రంపోడు, కొత్తపల్లిలో ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీకి మించి విక్రయించిన వారిపై కేసులు నమోదుచేశారు. గతంలోనూ శాలిగౌరారం, గుర్రంపోడు, నల్లగొండ రూరల్ మండలాల్లో ఎరువుల దుకాణాలపై కేసులు నమోదు చేయగా, తాజాగా శుక్రవారం మరో రెండు దుకాణాలపై కేసులు నమోదయ్యాయి

బ్లాక్‌మార్కెట్‌కు యూరియా..

రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత ఉన్నా జిల్లాలో అలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు, అందుబాటులో ఉన్న యూరియా అవసరమైన రైతులకే అందించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో ప్రస్తుతం యూరియా సరిపోక రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా జూన్, జూలై నెలల్లో యూరియా విక్రయాల్లో ఎలాంటి నియంత్రణలు పాటించలేదని, ఎవరు ఎంత అడిగితే అంత ఇచ్చారని, అందుకే బఫర్ స్టాక్ కరిగిపోవడమేగాక ఆ రెండు నెలల్లో జిల్లాలో సాగుకు అవసరమైన యూరియా కంటే దాదాపు రెట్టింపు వినియోగమైందని, అదనపు యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలిందని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం యూరియా అవసరం పెరగడం, సరఫరా లేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో యూరియా ధరలకు రెక్కలొచ్చాయని చెబుతున్నారు. ఇప్పుడు అనుసరిస్తున్నట్లే, సీజన్ ఆరంభం నుంచి రైతులకు అవసరమైన మేర యూరియా అందించి ఉంటే ఈ ఆందోళనలు, ధర్నాలకు ఆస్కారమే ఉండేది కాదని చెబుతున్నారు.

కల్వకుర్తి-మాచర్లకు రైలు

- ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం
- దేవరకొండకు మహర్దశ



దేవరకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నుంచి దేవరకొండ మీదుగా మాచర్లకు రైల్వే మార్గానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ రైల్వే లైన్ కోసం ఏళ్లుగా పట్టణ వాసులు ఎదురుచూస్తుండగా, చివరికి కేంద్రం ఆమోదంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కల్వకుర్తి, దేవరకొండ మీదుగా మాచర్లకు 126కిలోమీటర్ల మేర రైల్వే మార్గానికి రూ.2,520కోట్లతో ఏర్పాటుచేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 11న రైల్వేశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలోని పలు రైల్వే లైన్లతోపాటు కల్వకుర్తి-మాచర్ల రైల్వే లైన్ కూడా మంజూరుచేస్తున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించారు.

దేవరకొండకు మహర్దశ

దేవరకొండ మీదుగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేన్ల జాతీయ రహదారికి, తాజాగా రైల్వే మార్గం ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో వ్యాపార, రవాణాపరంగా అభివృద్ధి చెందనుంది. జడ్చర్ల-కోదాడ, వయా దేవరకొండ మీదుగా ఎన్‌హెచ్-167 విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఆమోదం తెలిపింది. 219 కిలోమీటర్ల మేర నాలుగు లేన్లుగా ఈ రోడ్డును ఏర్పాటు చేయనున్నారు. 2028 నాటికి ఇది పూర్తికానుంది. నాలుగు లేన్ల జాతీయ రహదారి మంజూరుతోపాటు కల్వకుర్తి నుంచి దేవరకొండ మీదుగా మాచర్లకు రైల్వే లైన్ ఏర్పాటుకానుండటంతో దేవరకొండ అభివృద్ధి చెందుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

- మిగతా 6వ పేజీలో...

రైల్వే లైన్ ఏర్పాటయితే అభివృద్ధి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు పర్యాయాలు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించడంతో రైల్వే లైన్లకు ఆమోదం తెలిపింది. కల్వకుర్తి వయా దేవరకొండ మీదుగా మాచర్లకు రైల్వేలైన్ నిర్మాణాన్ని కేంద్రం ఆమోదించింది. నిధులు సైతం కేటాయించినట్టు తెలిపింది. త్వరగా సర్వే నిర్వహించి రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలి. రైల్వే లైన్ ఏర్పాటులో సీఎం రేవంత్‌రెడ్డి కృషి ఎంతో ఉంది.

- బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

నెరవేరనున్న కల

దేవరకొండ నుంచి రాయచూరు, జడ్చర్ల, మాచర్లకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని 30 ఏళ్లుగా ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత జైపాల్‌రెడ్డి, ప్రస్తుత శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో ఈ రైల్వే లైన్ విషయాన్ని పలు పర్యాయాలు పార్లమెంట్‌లో ప్రస్తావించారు. రైల్వే లైన్ ఏర్పాటు కోసం వీరితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి సైతం పలు పర్యాయాలు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరగా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజా శ్రేయస్సే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలనాయక్ అన్నారు. మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని నర్సిరెడ్డిగూడెంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రూ.11.35కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులకు ఇలా త్రిపాఠితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామస్థాయిలో గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న నర్సిరెడ్డిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమస్య పరిష్కారం కావడం సంతోషంగా ఉందన్నారు. 257 మంది నిర్వాసితులకు ప్లాట్లు కేటాయించామని, మిగిలిన 37 మందికి త్వరలో కేటాయిస్తామన్నారు. శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయిర్ కింద ముంపు గ్రామాలైనా నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకపల్లి తండాల్లో సుమారు 289 మంది నిర్వాసితులకు ప్లాట్లతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలు, ఎంపీడీవో సుజాత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, ఎరుకుల వెంకటయ్య గౌడ్, నాయకులు కొండూరి పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ స్థలం పరిశీలన

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొల్ముంతలపహాడ్ గ్రామపంచాయతీ సర్వే నెం.202లో 25ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల కోసం స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రూ.200కోట్లతో పాఠశాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్నట్టు తెలిపారు. వారి వెంట తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ నేత దొంతినేని వెంకటేశ్వర్‌రావు, తదితరులు ఉన్నారు.

15న 'ప్రజావాణి' రద్దు : కలెక్టర్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ఈ నెల 15న సోమవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న గవర్నర్ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. దీంతో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దుచేశామని, ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ ఉండాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నల్లగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రైవేట్ స్కూల్ బస్సుకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ ఉండాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉదయాదిత్య భవనంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల బస్సులకు అర్హులైన డ్రైవర్ల నియామకం చేపట్టాలన్నారు. విద్యార్థులు బస్సుల్లో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రతలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో బొల్లారం భిక్షపతి, డీటీసీ శ్రీవాణి, డీటీవో లావణ్య, పాల్గొన్నారు.

ఆర్టీసీలో గిఫ్ట్ ఏ బస్ ట్రావెల్

- 'యాత్రాదానం' పేరుతో వినూత్న సేవా కార్యక్రమం
- దాతల సహకారంతో యాత్రలు చేపట్టేలా కార్యాచరణ
- రీజియన్‌లో ఏడు డిపోల పరిధిలో అమలుకు ఏర్పాట్లు



నల్లగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యత, సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్టీసీ 'యాత్రాదానం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆర్టీసీలో ఇటీవల ప్రవేశపెట్టిన పలు టూర్ ప్యాకేజీలు విజయవంతమైన నేపథ్యంలో ప్రత్యేకంగా దాతల కోసం యాత్రాదానం అనే సరికొత్త పథకాన్ని తీసుకువచ్చింది. ముఖ్యంగా పుట్టిన రోజులు, వివాహ మహోత్సవాలు, పండుగలు, ఇతర శుభ కార్యక్రమాలకు, నిరుపేద విద్యార్థులకు విజ్ఞాన యాత్రలకు, పుణ్య క్షేత్రాలకు వెళ్లే భక్తులకు 'యాత్రాదానం' చేసేలా కార్యక్రమాన్ని రూపొందించారు. అదేవిధంగా నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులను పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహార యాత్రలకు తీసుకెళ్లేందుకు దాతలు ముందుకు వచ్చి ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకోవచ్చు. ఈ పథకం నిర్వహణకు సంస్థ ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేసింది. దాతలు ముందుకు వచ్చి ఆయా డిపోల మేనేజర్లను కలిస్తే సంబంధిత యాత్రాదానం పథకం గురించి తెలియజేస్తారని ఉన్నతాధికారులు తెలిపారు.

రీజియన్ పరిధిలో అమలు

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, యాదగిరిగుట్ట డిపోల్లో అమలుచేయనున్నారు. ఆర్టీసీ ప్రత్యేకంగా 'గిఫ్ట్ ఏ బస్ ట్రావెల్' పథకాన్ని రూపొందించింది. దీన్ని దాతలు ఏ సందర్భంలోనైనా వినియోగించుకోవచ్చు. ప్రధానంగా ప్రైవేట్ సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్ఆర్ఐలు లేదా ఉమ్మడి కుటుంబాలు ఎవరైనా దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టే అవకాశాన్ని ఆర్టీసీ కల్పించింది. దాతలు డబ్బును సంస్థకు విరాళంగా అందజేస్తే సంస్థ బస్సు సదుపాయాన్ని కల్పిస్తుంది. ఎవరైనా నిరుపేదలు యాత్రకు వెళ్లాలంటే డబ్బు లేకుంటే దాతలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమం ద్వారా వారికి అవకాశం కల్పించవచ్చు. దాతలు ఇవ్వాల్సిన మొత్తాన్ని సంస్థకు సంబంధించిన యాత్రాదానం నిధి ప్రత్యేక కార్పొరేట్ ఖాతాలో జమ చేస్తారు. అదేవిధంగా టీజీఎస్ఆర్టీసీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ బదిలీతో పాటు క్యూఆర్ కోడ్, యూపీఐ చెల్లింపులు కూడా చేయవచ్చు. దాత (స్పాన్సర్) పేరు మీద జారీ చేసిన అధికార వెబ్‌సైట్ ద్వారా దాతలు నగదు రశీదును కూడా పొందవచ్చు. అదేవిధంగా టీజీఎస్ఆర్టీసీ పోర్టల్ ద్వారా కృతజ్ఞతగా స్పాన్సర్‌లకు ప్రయాణానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను కూడా అందజేస్తుంది. ఈ ప్రయాణాన్ని ఉపయోగించుకోవడానికి 36సీట్లు ఉన్న ఏసీ బస్సులు, 34సీట్లు ఉన్న సూపర్ లగ్జరీలు, 40సీట్లు ఉన్న డీలక్స్ బస్సులను, 50సీట్లు ఉన్న ఎక్స్‌ప్రెస్‌లను ఆర్టీసీ దాతలకు సమకూరుస్తుంది. దాతలు ట్రిప్పుకు సంబంధించి కనీసం ఏడు రోజుల ముందు సమాచారం ఇవ్వాలని అధికారులు పేర్కొంటున్నారు.

దాతలు సద్వినియోగం చేసుకోవాలి

ఆర్టీసీ చేపట్టిన ఈ వినూత్న సామాజిక కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్ఆర్ఐలు, అసోసియేషన్‌లు, ఎన్జీవోలు సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలి. సామాజిక బాధ్యతల పరంగా యాత్రాదానం పథకాన్ని చేపట్టడం జరిగింది. అదేవిధంగా ప్రైవేట్ సంస్థలు, ఉమ్మడి కుటుంబాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని దాతృత్వ భావంతో సహకరించాలి. ఈ కార్యక్రమాన్ని రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో అమలుచేస్తున్నాం.

కె.జానిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం

మతాలు, కులాల మధ్య బీజేపీ చిచ్చు

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్
- వల్లాలలో అమరుల స్మారక పైలాన్ ఆవిష్కరణ



శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో అమరుల స్మారక పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేతలు వీహెచ్, జానారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు సామేలు, వేముల వీరేశం, తదితరులు

4

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భిక్షంగౌడ్



పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా నాయకులు

నల్లగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుంకరి భిక్షంగౌడ్ ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పీఆర్టీయూ భవనంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భిక్షంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భిక్షంగౌడ్ నల్లగొండ మండల అధ్యక్షుడిగా ఐదు పర్యాయాలు, జిల్లా అధ్యక్షుడిగా మూడు మార్లు, కార్యదర్శిగా మూడు పర్యాయాలు పని చేసి సంఘం అభివృద్ధికి కృషి చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేసి గుర్తింపు పొందారు. కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన భిక్షంగౌడ్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి, కార్యదర్శి జాన్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు ఫణికుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి అద్దంకి సునిల్, ఆర్‌సి.రెడ్డి, ఫరీద్, రవిశంకర్‌గౌడ్, వీరమల్ల శ్రీనివాస్‌గౌడ్, నాగయ్య, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా నర్సింహారెడ్డి, తదితరులు

సాయుధ పోరాటాన్ని వక్రీకరించేందుకు బీజేపీ కుట్ర

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

డిండి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డిండి మండలకేంద్రంలో కమ్యూనిస్టు ఉద్యమకారులు, అమరులు కృష్ణశర్మ, ఎలిమినేటి పెద్దయ్య, చింతకుంట్ల వెంకటయ్య స్మారకస్తూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయధ పోరాటం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన మహోత్తర సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి, మోయినుద్దీన్, దొడ్డి కొమరయ్య నాయకత్వం వహించారన్నారు. పోరాట ఫలితంగా 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిందని అన్నారు. సాయుధ పోరాటానికి సంబంధంలేని మతోన్మాదులు వారికి అనుకూలంగా చరిత్రను మలుచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశభక్తులుగా చలామణి అవుతూ రాజ్యాంగాన్ని సవరిస్తూ దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు యత్నిస్తున్న బీజేపీ కుట్రను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం దొరలు, భూస్వాములు, పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాట వారోత్సవాలు ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, టి.బుచ్చిరెడ్డి, శ్రీరామదాసు కనకచారి, ఎండి.మోయినుద్దీన్, టి.విజేందర్‌రెడ్డి, శైలేజ్, నూనె వెంకటేశ్వర్లు, సోమిడి శ్రీనయ్య, కేశవులు, దుబ్బ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రహం 'కట్టలు' తెగుతోంది

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూరియా కోసం రైతుల ఆందోళన ● గంటల కొద్దీ క్యూలో ఉన్నా దొరకని యూరియా



నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలో రాస్తారోకో చేస్తున్న రైతులు, మిర్యాలగూడ వైపు నిలిచిన వాహనాలు

రైతుల ఆగ్రహం కట్టలు తెగు తోంది. రోజుల తరబడి యూరియా కోసం తిరుగుతున్నా దొరకడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిద్రాహారాలు మాని వస్తున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శుక్రవారం పలు చోట్ల అన్నదాతలు రోడ్డెక్కారు.

తిప్పర్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతను నిరసిస్తూ తిప్పర్తి మండల రైతులు నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వారం రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా రేపు వస్తాయంటూ ప్రతిరోజూ అదే సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా ఇచ్చేందుకు అధికారుల నుంచి హామీ వచ్చేంత వరకు రాస్తారోకో విరమించేది లేదంటూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. సుమారు 45నిమిషాల పాటు రోడ్డుపైనే బైఠాయించారు. రహదారిపై మిర్యాలగూడ వెళ్లేదారిలో ఐదుకిలోమీటర్ల మేర, నల్లగొండ వైపు మూడు కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచాయి. కలెక్టర్ రావాలంటూ మరి కొంతమంది రైతులు నినాదాలు చేయడంతో స్థానికంగా ఉన్న మండల వ్యవసాయ శాఖ అధికారి సన్నిరాజు, తిప్పర్తి ఎస్ఐ శంకర్ అక్కడికి చేరుకొని రెండు లారీల యూరియా వస్తుందని, అందుకు తగిన టోకెన్లు తీసుకోవాలని సూచించడంతో రైతులు అక్కడి నుంచి వెళ్లారు. టోకెన్లు తీసుకోవాలని చెప్పిన అధికారులు నకిరేకల్ రోడ్డులోని రైతు వేదిక వద్ద లైనులో ఉండాలని సూచించారు. 500లకు పైగా రైతులు లైన్‌లో వేచిఉండగా అదుపు చేయలేక టోకెన్లు ఇవ్వడం ఆలస్యమైంది. దీంతో రైతులు మూడు గంటలకు పైగా క్యూలైన్‌లో వేచి ఉన్నారు.

చందంపేట: చందంపేటలో యూరియా కోసం రైతులు రైతువేదికలు, పీఏసీఎస్ కేంద్రాల వద్ద క్యూలు కడుతున్నారు. 220 బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉండటంతో ఒక్కో రైతుకు బస్తా చొప్పున పంపిణీ చేశారు.

కొండమల్లేపల్లి:కొండమల్లేపల్లిలో తెల్లవారుజాము నుంచి రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. నాలుగు రోజుల క్రి తం రైతులకు 800టోకెన్లు జారీ చేసినప్పటికీ యూరియా అందజేయలేక పోయారు. దీంతో ఆగ్రహించిన రైతులు పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఏవో జానకిరాములతో వాగ్వాదానికి దిగారు. శుక్రవారం రెండు లారీల యూరియా రావాల్సిఉండగా ఒక లారీ మాత్రమే వచ్చిందని, మరోలారీని పెండ్లిపాకల గ్రామానికి ఎలా పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యూరియా కోసం తోపులాట

పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా పీఏపల్లి సింగిల్ విండో కార్యాలయం, గుడిపల్లి రైతు వేదిక, రెండు ఆగ్రో రైతు కేంద్రాలకు యూరియా వచ్చిందని తెలియడంతో రెండు మండలాల రైతులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. మధ్యాహ్నం వరకు రైతులు క్యూలైన్‌లోనే నిరీక్షించారు. తమవంతు ఎప్పుడు వస్తుందా అని నిద్రాహారాలు మాని పడిగాపులు కాశారు. సహనం నశించిన రైతుల మధ్య ఒక్కసారిగా తోపులాట జరిగింది. దీంతో పోలీసులు అక్కడి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు.

డిండి: యూరియా కోసం 400 మందికిపైగా రైతులు నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద బారులు తీరారు. మరికొందరు గురువారం రాత్రి ఆటోల్లో మండలకేంద్రానికి చేరుకొని పీఏసీఎస్ కార్యాలయం వద్దే నిద్రించారు.



సీతారాంపురం పీఏసీఎస్ కార్యాలయం వద్ద నిద్రిస్తున్న రైతులు

యూరియా కష్టాలు తీరేదెప్పుడో..!

భానుపురి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట పట్టణంలోని సీతారాంపురంలో రైతులు గురువారం రాత్రి పీఏసీఎస్ కార్యాలయం వద్ద నిద్రించారు. శుక్రవారం ఉదయం క్యూలో ఉండి యూరియాను తీసుకువెళ్లారు. రోజు వారీగా యూరియా వస్తుందని ఏవో సందీప్ తెలిపారు. రైతులు పెద్దసంఖ్యలో రావడంతో గందరగోళం నెలకొంది.

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని పీఏసీఎస్‌కు 400 బస్తాల యూరియా విలువలు వచ్చాయనే సమాచారంతో రైతులు వేకువజాము నుంచి భారీ సంఖ్యలో వచ్చారు. ఒక్కో రైతుకు రెండు యూరియా కట్టలు, అర లీటర్ నానో యూరియా డబ్బా అందజేశారు. చొప్పున స్టాకు ఉన్నంత వరకు పోలీసులు పహారాలో అందజేశారు. దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు.

పంపిణీ ఇలాగేనా..

మోతె : సూర్యాపేట జిల్లా మోతె మండలంలో తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో నిలబడుతున్నారు. సిరికొండ, సర్వారం సొసైటీల ద్వారా వస్తున్న యూరియా బస్తాలు మండలంలో పరపతి ఉన్న వారికే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. శుక్రవారం నామవరంలో సిరికొండ సొసైటీ ఆధ్వర్యంలో లారీలోడ్ రాగా వెయ్యి మందికి పైగా మహిళా రైతులు, రైతులు తెల్లవారక ముందే లైన్‌కట్టారు. యూరియా పంపిణీ చేయడంలో ఆలస్యం కావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐ అజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి లైన్‌లో ఉన్నవారికి ఒక్క కట్టచొప్పున అందజేశారు.

మఠంపల్లి: మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఏవో రైతులతో ఫోన్‌లో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమింపజేశారు.

● రైతులకు న్యాయం చేయలేకపోతున్నామని మఠంపల్లి పీఏసీఎస్ డైరెక్టర్లు గోలి చంద్రం, పట్టేటి అంతోని, పశ్య రామనర్సమ్మ, వల్లపుదాసు లింగయ్య రాజీనామా చేశారు.

తుంగతుర్తి : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రానికి వెయ్యి బస్తాల యూరియా వచ్చింది. రైతులు వేకువజాము నుంచే పీఏసీఎస్ వద్ద క్యూ కట్టారు. తాము ఇళ్లకు వెళ్లిన తర్వాత రాత్రిపూట టోకెన్లు ఇస్తున్నారని రైతులు అంటున్నారు. కొంతమంది రైతులు కలిసి బస్తాలు తీసుకొని ఒకే ఆటోలో వేసుకొని వెళ్ళడానికి ప్రయత్నం చేస్తే రైతులు అడ్డుకొని ఆందోళన చేశారు. ఆటోను ఆపివేసి ఒకరికి ఇన్ని బస్తాలు ఎలా ఇస్తారని అడ్డుకున్నారు.



తుంగతుర్తిలో ఆందోళన చేస్తున్న రైతులు



మోత్కూరులో బారులు తీరిన రైతులు

యూరియా కోసం తప్పని తిప్పలు

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో ఓ ఎరువుల దుకాణానికి యూరియా లారీ వచ్చిందని తెలియగానే రైతులు భారీగా తరలివచ్చి క్యూలో నిల్చున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సాఫీగా పంపిణీ చేయించారు. ఒక్కో రైతుకు సాగు విస్తీర్ణాన్ని బట్టి ఒకటి, రెండు బస్తాలు ఇచ్చారు. లోడ్ వచ్చిన రెండు గంటల్లోనే పూర్తిగా విక్రయించారు. కొందరికి యూరియా దొరక్కపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

మద్దిరాల: యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులు మండల కేంద్రంలో ఆగ్రోస్, ఎన్‌డీటీసీ కేంద్రాల ముందు క్యూలైన్‌లో ఉన్నారు. రైతులు ఒకరికి ఒకరు తోసుకోవడంతో తుంగతుర్తి సీఐ నరసింహ ఆధ్వర్యంలో ఎస్ఐ వీరన్న సహకారంతో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

క్యూలో సొమ్మసిల్లి..

ఆత్మకూరు(ఎస్): సాగు చేయడంకంటే రైతులకు యూరియా కష్టాలు ఎక్కువవుతున్నాయి. యూరియా వస్తుందని తెలియడంతో వివిధ గ్రామాల నుంచి రైతులు యూరియా పంపిణీ కేంద్రాల వద్ద గురువారం రాత్రి చేరుకొని మహిళలతో క్యూలైన్ కట్టారు. శుక్రవారం తెల్లవారు జామున వస్తుందని ఆయా గ్రామాల్లోని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరగడంతో ఆత్మకూర్(ఎస్), పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు తండోపతండాలుగా వచ్చి క్యూలైన్‌లో కూర్చున్నారు. ఆత్మకూర్(ఎస్) కేంద్రానికి శుక్రవారం యూరియా రాకపోవడంతో సాయంత్రం 4గంటల వరకు ఎదురుచూసి వెనుదిరిగారు. ఏపూర్ పీఏసీఎస్ కేంద్రానికి వచ్చిన ఏపూరు తండాకు చెందిన వాంకుడోతు బోడ్యా సొమ్మసిల్లి పడిపోయాడు. కొద్దిసేపటికి తేరుకున్నాడు.

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ సహకార సంఘానికి యూరియా లోడు వచ్చింది. కేవలం 277 బస్తాల యూరియా మాత్రమే రాగా రైతులు వందల సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే యూరియా కోసం రైతులు బారులు తీరారు. యూరియా ఎంతసేపటికీ ఇవ్వకపోవడంతో క్యూలో నిలబడలేక రైతులు చెప్పులను క్యూపద్ధతిలో పెట్టారు. కొంతమంది రైతులకు సహకార సంఘం అధికారులు టోకెన్లు ఇచ్చారు. సాయంత్రం 4 గంటల వరకు యూరియా ఇచ్చినా, సరిపడా లేకపోవడంతో 100మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

అర్వపల్లి: అర్వపల్లి పీఏసీఎస్ కార్యాలయానికి 450యూరియా బస్తాలు రాగా పెద్దసంఖ్యలో రైతులు అక్కడికి చేరుకున్నారు. ఎస్ఐ సైదులు, తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో గణేష్ ఆధ్వర్యంలో క్యూలైన్‌లో నిలబడి స్లిప్పులు ఉన్న రైతులకు యూరియా బస్తాలను అందజేశారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఉదయం ఆరుగంటల నుంచే రైతులు క్యూలైన్‌లో నిలబడ్డారు. చెప్పులు, ఆధార్‌కార్డులు, వరుసలో పెట్టి కూర్చున్నారు. ఎంతకూ టోకెన్లు ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన రైతులు నూతనకల్‌లోని సూర్యాపేట- దంతాలపల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. కొద్దిసేపటి తర్వాత ఎస్ఐ రావుల నాగరాజు వచ్చి రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేయించారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాల్సిందే

● నిర్వాసితులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి

● ఆర్‌ఆర్‌ఆర్ నిర్వాసితుల ధర్నాలో విపక్ష నాయకులు

● మద్దతు తెలిపిన సీపీఐ, సీపీఎం, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు



జాతీయరహదారిపై రైతుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందే అని విపక్ష నాయకులు డిమాండ్ చేశారు. నిర్వాసితులకు భూమికి బదులు భూమి, ఇంటికి బదులు ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదా ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ ను ఓఆర్‌ఆర్‌కు 40 కిలోమీటర్ల దూరంలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం మండలాలకు చెందిన ఆర్‌ఆర్ ఆర్ భూ నిర్వాసితులు ధర్నా చేశారు. రైతుల ఉద్యమానికి అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చౌటుప్పల్ ప్రాంతంలోని కొన్ని పరిశ్రమలకు అనుకూలంగా ఉండే విధంగా ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చారని అన్నారు. నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారం లేనప్పుడు మరోక విధంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు, రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో పేదల భూములను ప్రభుత్వాలు లాక్కుంటన్నాయని ఆయన అన్నారు. భూములను కోల్పోతున్న రైతులకు ఎంత నష్ట పరిహారం చెల్లించిన కూడ తక్కువే అవుతుందని ఆయన అన్నారు. భూ నిర్వాసితులకు భూమికి భూమి, ఇళ్లకు ఇళ్లు, బహిరంగ మార్కెట్ విలువ ప్రకారంగా నష్టపరిహారాన్ని చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని పరిశ్రమల కోసమే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్పిడి చేయించారని ఆయన ఆరోపించారు. ఆ ఇద్దరు నేతలు తలుచుకుంటే 5 రోజుల్లోనే అలైన్ మెంట్‌ను మార్చగలరని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంట్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టగా, దక్షిణ భాగాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ఆయన అన్నారు. మార్కెట్ విలువకు మూడు రేట్లు అధికంగా నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణా రెడ్డి, బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఆర్‌ఎస్ నాయకులు దూడల బిక్షం గౌడ్, ఆర్. శంకర్, దిండు భాస్కర్, బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, గిర్కటి నిరంజన్ గౌడ్, పల్లె శేఖర్ రెడ్డి ,పబ్బు వంశీ, వి. వెంకట్ రెడ్డి, దబ్బటి రామ్‌గౌడ్ పాల్గొన్నారు.

రాస్తారోకో యత్నం భగ్నం

చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై రెండు, మూడు ప్రాంతాల్లో రాస్తారోకో చేసేందుకు నిర్వాసితులు చేసిన ప్రయాత్నాలను పోలీసులు భగ్నం చేశారు. పోలీసులతో మహిళా రైతులు వాగ్వాదానికి దిగారు. ఆర్డీవో కార్యాలయంతో పాటు జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. ఏసీపీ పి.మధుసూధన్ రెడ్డి పర్యవేక్షణలో సీఐ మన్మథకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు రైతులను కట్టడి చేయడంతో పాటు వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

మతాలు, కులాల మధ్య బీజేపీ చిచ్చు

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



వల్లాల గ్రామంలో స్థూపావిష్కరణ సభలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వేదికపై మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, వీ హనుమంతరావు

శాలిగౌరారం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కులాలు, మతాల మధ్య పెట్టడమే తప్ప స్వాతంత్ర్య, సాయుధపోరాటంలో ఎటువంటి పాత్ర లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు వీ హనుమంతరావు సహకారంతో నిర్మించిన అమరవీరుల స్మారక పైలాన్‌ను శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వందేళ్ల పైబడి చరిత్రతో పాటు పోరాట చరిత్ర ఉందన్నారు. 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చిన కథనానికి వీహెచ్ చలించి అమరుల స్మారక స్థూపాన్ని నిర్మింపజేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ సాయుధపోరాటంలో కాల్చి చంపబడిన విద్యార్థు పేర్లు, పోరాటం పాఠ్యాంశంలో చేర్చేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. దేశంలో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే దురుద్దేశ్యంతో సీబీఐ, ఈడీ, ఎలక్షన్ కమిషన్‌లను జేబు సంస్థలుగా చేసుకుంటుందన్నారు. బీజేపీ శ్రీరాముడి పేరుతో ఓట్లు అడగడం అవివేకమన్నారు.వల్లాలలో అమరులైన అమర కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.

అమరుల కుటుంబాలకు ఇల్లు వచ్చేట్లు కృషి: వీహెచ్

వల్లాల గ్రామంలో 10మంది విద్యార్థులను రజాకార్లు చంపడం విచాకరమని, అమరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు వచ్చేట్లు తనవంతుగా కృషి చేస్తానని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు వీ.హనుమంతరావు అన్నారు. అమరవీరుల స్థూపం నిర్మించడం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ పాత్ర శూన్యమన్నారు.

బలిదానంతో నవచైతన్యం : జానారెడ్డి

విద్యార్థుల బలిదానంతో పోరాటంలో నవచైతన్యం నింపిందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. అమరుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారిత్యాగం మరవలేనిదన్నారు. ఎమ్మెల్యే అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడంలో ముందుండాలన్నారు.

కాంగ్రెస్‌తో రాష్ట్రం అభివృద్ధి : ఎంపీ చామల

స్వాతంత్ర్య, తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందని, తెలంగాణను కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేసిందని ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. అదేవిధంగా సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అమరవీరుల కోసం ఒక స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, నేతి విద్యాసాగర్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌చార్జి విశ్వనాథన్, బీసీ నాయకులు చామల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగే నర్సింహ, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, నాయకులు నూక కిరణ్‌కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు షేక్ ఇంతియాజ్‌అహ్మద్, భూపతి వెంకన్న, దండ అశోక్‌రెడ్డి, చింత ధనుంజయ, వడ్లకొండ పరమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మాదగోని కవిత రామలింగయ్య, గోపినాథ్, అరుణ్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బొమ్మకల్ గ్రామశివారులోని పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్ఐ డీ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. డ్రైవర్లు బొమ్మకంటి గణేష్, బొమ్మకంటి శివ, దామెర్ల రాకేష్‌లపై కేసులను నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం

● నేడు జాతీయ మెగా లోక్ అదాలత్

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

చాలామంది పట్టువిడుపులకు పోయి కేసులు రాజీ పడకుండా కోర్టుల చుట్టూ తిరుగుతుంటారు. సమాజంలో ప్రతీ ఒక్కరు రాజీ మార్గంలో పయనించాలని సూచిస్తున్నారు. కోర్టుల్లో కేసుల విషయంలో కూడా రాజీమార్గం అనుసరించాలని, అదే రాజమార్గమని న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం కోర్టుల్లో ఏర్పాటుచేసే లోక్ అదాలత్‌లలో కక్షిదారులు కేసులను పరిష్కరించుకుంటే బాగుంటుందని, ఇందుకోసం ఈ నెల 13న అన్ని ప్రధాన కోర్టుల్లో జాతీయ మెగాలోక్‌అదాలత్‌ను నిర్వహించబోతున్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసే కేసులకు సంబంధించిన వారికి అవగాహన కల్పిస్తున్నారు.

కక్షిదారులకు అవగాహన

సూర్యాపేట జిల్లా పరిధిలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి కోర్టుల్లో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసులు కేసుల్లో ఉన్న కక్షిదారుల వివరాలను సేకరించి రాజీ కోసం వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈమెగా లోక్ అదాలత్‌లో కనీసం సూర్యాపేట జిల్లాలో 10వేల కేసులు రాజీ అయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

రాజీ అయ్యే కేసులు ఇలా..

లోక్ అదాలత్‌లో అన్ని రకాల కేసులు రాజీ పడే అవకాశం లేదు. కొన్ని సెక్షన్లకు సంబంధించిన కేసులు మాత్రమే రాజీ చేసుకునే అవకాశముంది. అదనపు కట్నం కోసం వేధించిన కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు గాయపడినవి మాత్రమే, పరువునష్టం, ఛీటింగ్, ఆస్తి తగాదాలకు చెందినవి, చెక్‌బౌన్స్ కేసులు, విడాకుల కేసులు, ఇన్సూరెన్స్‌కు సంబంధించిన, డ్రంకన్‌డ్రైవ్, పెట్టీ కేసులు రాజీ చేసుకునే వెసులుబాటు ఉంది.

లోక్ అదాలత్ ఉద్దేశం

క్షణికావేశంలో జరిగిన గొడవల కారణంగా ఒకరిపై మరొకరు పెట్టుకున్న కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేయడమే లోక్ అదాలత్ ఉద్దేశం. లోక్‌అదాలత్‌లను సంప్రదించినట్లయితే తక్కువ సమయంలో ఖర్చు లేకుండా ఇరువర్గాలకు సమ్మతమైన చట్టప్రకారం పటిష్టమైన న్యాయం పొందే అవకాశముంది. ఒకవేళ లోక్ అదాలత్‌లో రాజీ పడకపోతే కోర్టు సూచించిన ప్రకారం మళ్లీ కోర్టు తెలిపిన తేదీల్లో కోర్టుకు హాజరుకావాలి.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి.పంతాలు, పట్టింపులకు పోయి కోర్టుల చుట్టూ తిరగవద్దు. రాజీ పడగలిగే కేసుల్లో మాత్రమే లోక్ అదాలత్‌లో రాజీ పడే అవకాశముంది. కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృధా చేసుకోవద్దు. రాజీ మార్గమే రాజమార్గం. కేసులు ఇరుపక్షాలు రాజీ పడడం వలన స్నేహం ఏర్పడుతుంది. దీంతో ప్రశాంతంగా జీవించవచ్చు.

-కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ సూర్యాపేట జిల్లా

ఫర్టిలైజర్స్ దుకాణంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫరిలైజర్స్ దుకాణానికి కేటాయించిన యూరియా కోటాను విక్రయించడంలో జరుగుతున్న జాప్యంపై పలువురు నుంచి ఫిర్యాదులు అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం జరిగింది. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు మహేందర్, శివ, ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్‌తో కలసి తనిఖీలు చేపట్టారు. పాత వ్యవసాయమార్కెట్ యార్డు రోడ్డులోని రైతుమిత్ర ఫెర్టిలైజర్స్ దుకాణానికి 20మెట్రిక్ టన్నుల యూరియాను అధికారులు కేటాయించారు. అయితే దుకాణంలో దిగుమతైన యూరియాను విక్రయించడంలో డీలర్ నిర్లక్ష్యం ప్రదర్శించడంతో డయల్-100కు ఫోన్‌చేసి రైతులు ఫిర్యాదుచేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దుకాణంలో తనిఖీలు చేపట్టి స్టాక్, సేల్ రికార్డులను పరిశీలించారు. 20 మెట్రిక్ టన్నుల(400బస్తాలు) యూరియా కోటాను విక్రయించకుండా గోదాంలోనే నిల్వ చేయడంపై అనుమానం వ్యక్తం చేశారు. గోదాం తాళాలు స్వాధీనం చేసుకుని డీలర్ అశోక్‌రెడ్డిని ప్రశ్నించారు. సర్వర్ బిజీ కారణంగా ఈ-పాస్ మిషన్ ఐడీ అప్రువల్ ఆలస్యం కావడంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు యూరియా విక్రయాల్లో జాప్యం జరిగిందని డీలర్ అధికారులకు వివరించారు. దీనిపై మరింత లోతుగా విచారించేందుకు డీలర్‌ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇందిరమ్మ బిల్లు రాలేదని ఇటుకతో తలపై కొట్టుకుని..

మోటకొండూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత డబ్బులు రావని అధికారులు తెలుపడంతో ఓ లబ్ధిదారురాలి భర్త ఇటుకతో తలపై కొట్టుకోవడంతో గాయమైంది. యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన పీట్ల సుశీల, రాజుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేసింది. మొదటి విడతగా సుశీల ఖాతాలో రూ.లక్ష జమకాగా అప్పుచేసి స్లాబ్ వరకు నిర్మించాడు. శుక్రవారం హౌసింగ్ ఏఈ రవిచంద్ర గ్రామానికి చెందిన వేరే లబ్ధిదారుడి ఫొటో తీస్తుండగా అక్కడకు వచ్చిన సుశీల భర్త రాజు ఏఈతో రెండో విడత డబ్బులు రావడం లేదని గొడవకు దిగాడు. అనంతరం అసహనంతో పక్కనే ఉన్న ఇటుకతో తలపై కొట్టుకుని అక్కడి నుంచి వెళ్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపాడు. ఎస్ఐ అశోక్ ఘటన స్థలానికి చేరుకుని ఏఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఇందిరను వివరణ కోరాగా వాహనం, ఆస్తి లేవని తెలపడంతో మొదటి విడత డబ్బులు వచ్చాయన్నారు. రెండో విడత డబ్బులు రావాల్సి ఉండగా రాజుపై 2018లో టిప్పరు వాహనం ఉందని తేలడంతో డబ్బులు జమకావడం లేదన్నారు. విషయం తెలిసిన వెంటనే ఇంటి నిర్మాణం నిలిపివేయాలని సూచించామన్నారు. హౌసింగ్ ఏఈ రవిచంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

స్పోర్ట్స్



తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు

● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హుస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

భారత ఆశలన్నీ నీరజ్‌పైనే



స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం



నేటి భారత షెడ్యూల్

ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి

సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థాంప్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాద్లేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.

ఫైనల్‌కు జైస్మిన్

సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పంఫ్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఝర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు

బంగ్లాదేశ్ x శ్రీలంక

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హారిస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హారిస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).

ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..

● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/ చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి

● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషబ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జపనీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట

● 10 ఏళ్ల వరకు గడువు పెంపు

● సెబీ చైర్మన్ పాండే



ఇతర ప్రధాన నిర్ణయాలు

- రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
- రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
- నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
- రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
- ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్‌ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్ణీత గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు

● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అస్సోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ

ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్లు లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

● ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే.. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.

● హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.

● టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఏఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాకేశ్, శివ, బన్నీ, దుర్గాభవానీలను జీఎన్‌రావు ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, లక్ష్మయ్య, రవీంద్ర నాయక్, అధ్యాపకులు నడింపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి యోగా గొప్ప వరం

చిట్యాలరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మానవాళికి యోగా గొప్ప వరమని ఆర్ట్ ఆఫ్ లీవింగ్ టీచర్, జిల్లా కోఆర్డినేటర్ పల్లబు బుద్ధుడు అన్నారు. మండలంలోని ఉరుమడ్లలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌లోని విద్యార్థులకు శుక్రవారం యోగా, ధ్యానం, ప్రాణాయామం, సూర్యనమస్కారాలపై శిక్షణ ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడారు. యోగాసనాలు, ధ్యానంతో ఆరోగ్యకరంగా జీవించవచ్చని, అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో వార్డెన్ ప్రసాద్, స్వామి, శివ, శ్రీను పాల్గొన్నారు.

అసంపూర్తి డ్రైనేజీతో అవస్థలు



పొలాల గుండా పారుతున్న మురుగు నీరు

- వరి పొలాలపై పారుతున్న మురుగునీరు
- తీవ్రంగా నష్టపోతున్న పానగల్లు రైతులు
- కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యమే కారణం
- ఆందోళనకు సిద్ధమవుతున్న రైతులు

నల్లగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పానగల్‌లో నిర్మించిన డ్రైనేజీ వల్ల ఆ ప్రాంత రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అసంపూర్తి డ్రైనేజీ వల్ల అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల వైఫల్యం వల్ల మురుగు నీరు వ్యవసాయ భూములకు చేరి గత అనేక సీజన్లలో పంటలు సరిగ్గా పండని పరిస్థితి ఉంది. మురుగు నీరు చేరుతుండటంతో రైతులు ఆ భూములను పడావు పెట్టాలనే ఆలోచనకు వచ్చారు. మురుగునీరు వల్ల వరి సేద్యం కావాల్సిన భూమిలో గడ్డి పెరగడంతో ప్రస్తుతం భూమి పనికిరాకుండా పోతోంది. అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న ప్రధాన డ్రైనేజీ అసంపూర్తిగా ఉండటం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పానగల్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న డ్రైనేజీ నీటిని వ్యవసాయ బావులు, పొలాల్లోకి వదలడంతో ఆ నీరంతా సమీపంలోని సుమారు 80 ఎకరాలలోకి పోతోంది. దీంతో ఆ ప్రాంత రైతులు నాలుగేళ్లుగా ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతూ తమ గోడును వెళ్లబోసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పానగల్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో నిర్మించి కాల్వలోకి నీరు వెళ్లేలా చూడాలని, ఇందుకు సంబంధించి నిధులు కేటాయిస్తామని అప్పట్లో ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడానికే పరిమితమయ్యారు. ఈ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయిస్తానని ఇచ్చిన హామీని విస్మరించారు. మురుగు నీటిని పొలాల్లోకి వదలవద్దంటూ రైతులు కాంట్రాక్టర్లను కోరినా లెక్కచేయకుండా నీటిని పొలాల్లోకి వదిలేలా కాల్వ తీయించారు. దీంతో గతంలో పలుమార్లు ఆ ప్రాంత రైతులు పానగల్ సూరారం రోడ్డులో పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు.

ఆర్థికంగా నష్టపోతున్న రైతులు

నాలుగేళ్లుగా రైతులు నష్టపోతున్నారు. వాస్తవానికి అయితే మురుగునీరు పొలాల్లోకి పారకముందు ఎకరాకు సుమారు 40 బస్తాలు దిగుమతి రాగా అంతా కలిపి 80 ఎకరాలకు కలిపి మొత్తం ప్రతి సీజన్‌లో 3,200 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చేది. ప్రతీసీజన్‌లో రైతులు 2,200 క్వింటాళ్లకు పైగా ధాన్యాన్ని విక్రయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రైతులు ఇప్పటికే లక్షలాది రూపాయలు నష్టపోయారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగానే ఈ నష్టం వాటిల్లిందని వారు ఆరోపిస్తున్నారు. తక్షణమే తమ పొలాలకు మురుగునీరు రాకుండా చేయకపోతే ఆందోళనకు దిగడమే కాకుండా రోడ్డు, డ్రైనేజీ పనులను నిలిపివేస్తామని డ్రైనేజీకి అడ్డంగా మట్టిని తెచ్చి పోసి తమ పొలాలను కాపాడుకుంటామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ డీఈని వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు



అధికారులు, ప్రజాప్రతినిధులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అయినా అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనివల్ల అనేక సంవత్సరాలుగా పంటలు పండకుండా పోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తాం. మరోసారి రైతులమంతా కలిసి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తాం.

- ఉయ్యాల సైదులు, పానగల్లు

కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు



కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తామంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పంటలు పండకుండాపోయాయి. దీంతో చిన్నపాటి రైతులమైన తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న తమను కాంట్రాక్టర్, అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ మురుగునీటిని వ్యవసాయ భూమిలోకి వదులుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

- ఎం.జానయ్య, పానగల్లు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ వేగాన్ని పెంచాలి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఎంపీడీవో కే.ఉమేష్‌చారి అన్నారు. మండలంలోని జువ్విగూడెం, కృష్ణాపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. మండలంలో 551 ఇందిరమ్మ ఇళ్లకు ప్రతిపాదలను పంపగా 532 మందికి మంజూరు పత్రాలు అందజేశామన్నారు. వీరిలో 439 ఇళ్లకు మార్కౌట్ చేయగా 127 బేస్‌మెంట్ లెవెల్‌కు వచ్చాయని, వీరిలో 3 ఇళ్లు రూఫ్‌లెవెల్ వరకు నిర్మించారని చెప్పారు. 73మంది లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలో నిధులు జమ చేసినట్లు వివరించారు. ఇందిరమ్మ ఇంటికి ఉచిత ఇసుకను అందిస్తున్నారని, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు సమస్యలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట హౌజింగ్ ఏఈ ఇందు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

గొల్లగూడెం కల్లుగీత మత్స్య
పారిశ్రామిక సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని గొల్లగూడెం కల్లు గీత మత్స్య పారిశ్రామిక సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడు సముద్రాల మల్లికార్జున్, ఉపాధ్యక్షుడిగా కొత్త సోమలింగం, కార్యదర్శిగా మొగుళ్ల సైదులు, డైరెక్టర్లుగా సముద్రాల యాదగిరి, సముద్రాల నరేష్, సముద్రాల శ్రీనివాస్, సముద్రాల మధు, నారగోని యాదయ్య, దోరేపల్లి శివకుమార్ ఎన్నికయ్యారు. గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ దశరథ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా గౌరవ అధ్యక్షుడు నల్ల నర్సింహ, కొత్త యాదయ్య, గంధమళ్ల గౌరయ్య పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

61 రోజులకు గాను రూ.10,62,964 ఆదాయం

కనగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. 61 రోజులకు గాను రూ. 10,62,964 ఆదాయం సమకూరిందని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి, జీపీట వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు చంద్రయ్యగౌడ్, నాగేశ్వర్‌రావు, జేఏ ఉపేందర్‌రెడ్డి, అంజనేయులు, నాగరాజు, ధర్మకర్తలు నగేష్‌గౌడ్, రాజు, నరేష్, దుర్గమ్మ, బాబు, వెంకన్న, శంకర్‌రెడ్డి, ప్రభాకర్ అర్చకులు శ్రవణ్‌చార్యులు, మహేష్ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచేందుకే టికరింగ్ ల్యాబ్

కనగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు టికరింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో పద్మ అన్నారు. కనగల్ ఎస్ఏవీఎం మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అటల్ టికరింగ్ ల్యాబ్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ల్యాబ్ పరికరాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు సంపూర్ణమైన అవగాహన కల్పించాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, కోడింగ్, డీకోడింగ్ అంశాలను తెలియజేసే ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ థామసయ్య, ల్యాబ్ ఇన్‌చార్జి టీచర్ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు రాజు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కైలాష్‌నేత



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కైలాష్‌నేత

మునుగోడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి పున్న కైలాష్‌నేత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. మర్యాద పూర్వకంగా కలిసి చేనేత కార్మికులు తయారుచేసిన శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని ఆసరా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి హరికృష్ణ అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చిట్యాల మండలం వట్టిమర్తి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వై.జానకమ్మను శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. అనంతరం ఆమెను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులదేనని అన్నారు. కార్యక్రమంలో ఎస్. సరస్వతి, మౌనిక, ఎల్.సరిత, ఎ.మౌనిక, డి.భారతి, విమల, పవన్ పాల్గొన్నారు.

ఆటల్లోనూ ప్రతిభ చూపాలి : ఎంఈవో

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ ప్రతిభను కనబర్చాలని ఎంఈవో నర్సింహ అన్నారు. మండలంలోని బీ.వెల్లంల జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన సుమారు 200 మంది క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో మండలానికి గుర్తింపు తేవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దేశబోయిన నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు శంభులింగం, ఇమామ్ కరీం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కమ్మంపాటి వెంకటయ్య జన్మదిన వేడుకలు



కమ్మంపాటి వెంకటయ్యకు కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నార్కట్‌పల్లి మండల నాయకుడు చెర్వుగట్టుకు చెందిన కమ్మంపాటి వెంకటయ్యగౌడ్ జన్మదిన వేడుకలను అభిమానులు, కార్యకర్తల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మేకల రాజిరెడ్డి, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, దుబ్బాక శ్రీధర్, దొడ్డి నర్సింహ్మ, మేకల వెంకట్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దొడ్డి యాదయ్య, వంపు శివ, బాలెం బిక్షం, రేగట్టె వెంకట్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గాదరి రాంబాబు, పానుగుల్ల శంకర్, గౌరీదేవి నర్సింహ్మ, కమ్మంపాటి శంకర్, గోపాల్ పాల్గొన్నారు.

రేషన్ బదులు డబ్బులు ఇస్తే క్రిమినల్ చర్యలు

మర్రిగూడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇచ్చి రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన రాష్ట్ర విజిలెన్స్ బృందంతో కలసి మర్రిగూడలో చౌక దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే డీలర్‌షిప్ రద్దు చేస్తామని అన్నారు. డీలర్లు రేషన్ ఇవ్వడానికి బదులుగా డబ్బు ఇచ్చి, బియ్యం కొనుగోలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రఘునందన్ హెచ్చరించారు. రేషన్ నిర్వహణ చేత కాకపోతే రాజీనామా చేయాలని రఘునందన్ స్పష్టం చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు యాదయ్య, అంజయ్య పాల్గొన్నారు.

విధుల్లో చేరిన గ్రామ పాలనాధికారులు

● *భూ రికార్డులతో పాటు, ఇతర ప్రజాసేవలు*

నల్లగొండరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖలో ప్రభుత్వం చేపట్టిన మార్పుల్లో భాగంగా రెవెన్యూ పాలనాధికారులు తీసుకోవడంతో రెవెన్యూ పాలనాధికారులు విధుల్లో చేరి బాధ్యతలను చేపట్టారు. గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. దీంతో రెవెన్యూశాఖలో భూ రికార్డులు, పౌరసేవలు అందించడంలో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం తొలగించి వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించి గ్రామ పాలనాధికారులు రెవెన్యూ శాఖలోకి తీసుకున్నారు. భూములు రికార్డులు పహానీలు, వన్‌బీలు రికార్డుల్లో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇతర శాఖల్లోకి పంపించిన వీఆర్వో, వీఆర్వోలను మరల రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు అర్హత పరీక్షలు నిర్వహించి, కలెక్టర్ పర్యవేక్షణలో గ్రామపాలన అధికారులుగా విధుల్లోకి తీసుకున్నారు. నల్లగొండ జిల్లాలో 276 మంది మాత్రమే విధుల్లోకి తీసుకున్నారు. నల్లగొండ మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు 14 మందిని కేటాయించారు. నల్లగొండ మండలంలోని 31 గ్రామాల్లో విధులు నిర్వహించనున్నారు. ప్రజలు గ్రామపాలన అధికారుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తహసీల్దార్ కొత్తపల్లి పరశురాం తెలిపారు.

నల్లగొండ మండల గ్రామ పాలనాధికారులు

1.	గంధంవారిగూడెం - యం దుప్పలపల్లి, అన్నారెడ్డి గూడెం	మేడబోయిన శ్రవణ్‌కుమార్ (9908518175)
2.	కంచనపల్లి, బుద్ధారం, గుండ్లపల్లి -	కట్టా రాములు (9490494857)
3.	మామిళ్లగూడెం, అనంతారం, జి చెన్నారం, కొత్తపల్లి	షేక్ రఫీ (7386700701)
4.	అప్పాజిపేట, అన్నెపర్తి	జినుకల నర్సింహ (9866677526)
5.	చర్లపల్లి -	మేడి శ్రీనివాసులు - (9704823466)
6.	ఎం.దోమలపల్లి, పి.దోమలపల్లి, కాకులకొండారం	షేక్ అబ్దుల్ ఘని (9908910405)
7.	తొరగల్లు	మందుగుల వెంకటయ్య (9398269526)
8.	మర్రిగూడెం, ఆర్జాలబావి	చిట్యాల భవాని (950244961)
9.	వెలుగుపల్లి, రసూల్‌పూర్, ముషంపల్లి, జీకే అన్నారం	గట్టుపల్లి సబితా రెడ్డి (970562020)
10.	సూరారం	కట్టా సైదులు (7730933460)
11.	నల్లగొండ, గొల్లగూడ	మహ్మద్ నిరంజన్ (9959050437)
12.	పానగల్, శేషమ్మగూడెం	గాదరి జానయ్య (8886969381)
13.	నర్సింగ్‌బట్ల, దొనకల్, ఖుదావన్‌పూర్	నార్ల నిర్మల (9989943006)
14.	చందనపల్లి, దండెంపల్లి, అమ్మగూడెం, ఖాజీరామారం	సంది లచ్చయ్య (9177119074)

నకిలీ ఓటర్ల నమోదు ప్రజాస్వామ్యానికే మచ్చ

● *యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి*



బొంగోనిచెర్వులో ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఓటర్ల జాబితాలో తప్పుడు సమాచారం, నకిలీ ఓటర్ల నమోదు ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చని యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం బొంగోని చెర్వులో ఇంటింటి ఓటరు జాబితా పరిశీలన ఓటర్ల గుర్తింపు వివరాలను లోపాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఓటరు జాబితాల్లో నకిలీ పేర్లను చేర్చడం నిజమైన ఓటర్ల పేరులను తొలగించడం బోగస్ ఓటర్లలను చేర్చడం అక్రమాలకు పాల్పడటమేనన్నారు. ఓటు హక్కు అంటే కేవలం ఓటు వేసే హక్కు మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రధాన ఆయుధమని, ప్రజలు నిర్లక్ష్యం చేస్తే అవినీతి శక్తులు ప్రజాస్వామ్యాన్ని కబళిస్తాయన్నారు. ప్రతీ ఓటరు అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదదో ప్రతీ ఓటరు పరిశీలించుకోవాలని, ఓటును ఆయుధంగా మలచుకుని తగిన విధంగా బుద్ది చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రదానకార్యదర్శి జాల మణికంఠయాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఏనుగు రఘుమారెడ్డి, బొంగోనిచెర్వు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కందాటి మహేందర్‌రెడ్డి, అంశల శ్రవణ్‌కుమార్, అందె చందుయాదవ్, జక్కలి రాజుయాదవ్ పాల్గొన్నారు.

ప్రజాతంత్ర, లౌకిక శక్తులను ఏకం చేయాలి



నల్లగొండ: ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం అఖిల భారత మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి స్ఫూర్తితో వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక శక్తులను ఏకం చేయాలని పార్టీ శ్రేణులకు సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ సీపీఎం జిల్లా కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభకు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ తీరును ఆమె ఎదుటే విమర్శించిన ధీశాలి ఏచూరి అని అన్నారు. సభలో నాయకులు ప్రభావతి, సయ్యద్ హాశం, ఎండి సలీం, పి.నర్సిరెడ్డి, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, కొండ అనురాధ, తుమ్మల పద్మ, సైదులు, పరిపూర్ణచారి, మన్నెం బిక్షం. వెంకన్న, రవి, కుంభం కృష్ణారెడ్డి, పామనగుండ్ల అచ్చాలు పాల్గొన్నారు.

మునుగోడు : పట్టణంలో సీపీఎం నాయకులు బండ శ్రీశైలం, సాగర్ల మలేష్, కట్ట లింగస్వామి, మిర్యాల భరత్‌కుమార్, యాస రాణి శ్రీను, లింగస్వామి, వడ్లమూడి హనుమయ్య, కొంక రాజయ్య, నరేష్, శ్రీకాంత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గట్టుప్పల్ : సీపీఎం నాయకులు కర్నాటి సుధాకర్, టేకుమట్ల కృష్ణ, కర్నాటి వెంకటేశం పెద్దగాని నరసింహ, రైతు సంఘం మండలాధ్యక్షుడు ముసుకు బుచ్చిరెడ్డి, సీపీఎం సీనియర్ నాయకులు ఎండీ రబ్బాని, కర్నాటి యాదయ్య పాల్గొన్నారు

నకిరేకల్: సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, కందాళ ప్రమీళ, బొజ్జ చిన్న వెంకులు, జిట్టా నగేష్, రాచకొండ వెంకట్ గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, మారయ్య, సుధాకర్, సరోజ, చలకాని మల్లయ్య, పెంజర్ల సైదులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: సీపీఎం నాయకులు చింతపల్లి బయ్యన్న, చెర్కు పెద్దులు, కుమ్మరి శంకర్, కొప్పు శ్రవణ్, దండు రవి, అర్థం శ్రీనివాస్, ఐలయ్య, రామచంద్రం, మిర్యాల రాములు, నాగరాజు, గోపి, నరేశ్, యాదయ్య, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో
పలువురి చేరిక

కేతేపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ వార్డు సభ్యుడు తూర్పాటి కోటేష్ ఆధ్వర్యంలో 15 కుటుంబాలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే వీరేశం కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో తూర్పాటి శ్రీశైలం, నిరంజన్, చందు, శంకర్, తీగల అశ్విని, రమేష్, గాదరి బయ్యన్న, సుదర్శన్, సుధాకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్‌కె.లతీఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఆర్.లింగయ్య, కాంగ్రెస్ నాయకులు ఏపూరి జగన్నాథం, గాజుల ప్రభాకర్, యాదగిరి, జి.సతీష్, గ్యార సైదులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

మునుగోడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సెయింట్ ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం తమ స్కూల్ బస్సుల్లో గ్రామాల నుంచి సీట్ల పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తుందని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడతరు. ప్రైవేట్ స్కూల్ బస్సుల విషయంలో కనీస భద్రతా చర్యలు పాటించటం లేదని ఆరోపించారు. ఈ మేరకు ఆ స్కూల్ యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

యూరియా కష్టాలు అలాగే..

(3వ పేజీ తరువాయి)

యూరియా పంపిణీకి కట్టుదిట్ట కార్యాచరణ చేపట్టారు. జిల్లాకు వచ్చే యూరియాను సహకారసంఘాలు, ఎరువుల దుకాణాలతో పాటు, రైతువేదికల వద్ద విక్రయించేలా ఆదేశాలిచ్చారు. సహకార సంఘాలు, రైతువేదికల వద్ద ఏఈవోలు (వ్యవసాయవిస్తరణ అధికారి), ప్రైవేట్ ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల వద్ద మండల వ్యవసాయాధికారుల సమక్షంలో టోకెన్లు జారీ చేసి ఎరువులు పంపిణీచేస్తున్నారు. ఆయా క్లస్టర్ల పరిధిలో ఏ రైతుకు ఎంత అవసరమో గుర్తించి అంతవరకే యూరియా కేటాయిస్తూ టోకెన్లు జారీ చేస్తున్నారు. ప్రైవేట్ దుకాణాల వద్ద సైతం ఏవోలు జారీ చేసిన టోకెన్లకు మాత్రమే యూరియా ఇస్తున్నారు. అయినా యూరియా సరిపోవడం లేదని, యూరియా వచ్చినా పంపిణీ చేయడం లేదని పేర్కొంటూ రైతులు శుక్రవారం తిప్పర్తి, మిర్యాలగూడ, చందంపేట తదితర ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు. శుక్రవారం మిర్యాలగూడలోని ర్యాక్ పాయింట్‌కు 2,639 మెట్రిక్‌టన్నుల యూరియా రాగా, అందులో జిల్లాకు 1,800 మెట్రిక్‌టన్నులు కేటాయించారు. సాగర్ ఆయకట్టులో మిర్యాలగూడ డివిజన్‌కు 1,000 మెట్రిక్ టన్నుల కోటాను కేటాయించారు. ఈ స్టాక్ మొత్తాన్ని ఎనిమిది పీఏసీఎస్‌లకు 470 మెట్రిక్‌టన్నులు, మిగతా 520 మెట్రిక్ టన్నుల యూరియాను 29 ప్రైవేటు డీలర్లతోపాటు మూడు రైతు ఆగ్రోసేవాకేంద్రాలు, ఎనిమిది నాగార్జున కోఆపరేటివ్ సొసైటీలకు కేటాయించారు.

ప్రతీ బస్తా రైతుకే చేరేలా పంపిణీలో నియంత్రణ

జిల్లాలో యూరియా పంపిణీలో అవతవకలకు ఆస్కారం లేకుండా టోకెన్ల విధానం అమలు చేస్తున్నాం. ఏఈవోలు ధ్రువీకరించిన మేరకే రైతులకు టోకెన్లు జారీ చేస్తున్నాం. సహకారసంఘాలకు కేటాయించే యూరియా పంపిణీలో ఇబ్బందులేకుండా ఉండేందుకు వాటికి అనుబంధంగా మరో 29 రైతువేదికల వద్ద యూరియా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం. శుక్రవారం కూడా జిల్లాలో 11 రైతువేదికల వద్ద యూరియా పంపిణీచేశాం. ప్రైవేట్ డీలర్ల వద్ద సైతం యూరియా లారీ రాగానే ఏవో పర్యవేక్షణలోనే రైతులకు టోకెన్ల ద్వారా యూరియా అందిస్తున్నాం. జిల్లాకు కేటాయించిన యూరియా ఒక్క బస్తా కూడా పక్కదారి పట్టకుండా చూస్తున్నాం.

- పి.శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు

యూరియా పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఎక్కడైనా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటాం. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు కొనసాగుతాయి. యూరియాను ఎమ్మార్పీకి మించిన ధరలకు విక్రయించినా, అక్రమంగా నిల్వలు చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తాం. అక్రమ నిల్వలు, విక్రయాల విషయం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. జిల్లాలో ప్రైవేట్ ఎరువుల దుకాణాల నిర్వాహకులు విక్రయాల్లో పారదర్శకత పాటించాలి. దుకాణాల వద్ద స్టాక్ వివరాలను ప్రదర్శించాలి.

- శరత్‌చంద్ర పవార్, ఎస్పీ

అధికారుల సూచనలు పాటించాలి

మునుగోడురూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శుక్రవారం మునుగోడు మండలంలో పులి పలుపుల క్లస్టర్ పరిధిలోని గంగోరిగూడెంలో కేవీకే కంపసాగర్ ఏంటమాలజీ శాస్త్రవేత్త డాక్టర్ రాములమ్మ, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ లింగయ్య పత్తి పంట పొలాలను సందర్శించారు. రసం పీల్చు పురుగులు, ఎర్రనల్లి ఉధృతిని గమనించి రైతులకు అవగాహన కల్పించి నివారణ చర్యలను వివరించారు. వ్యవసాయ సంచాలకులు బి.వేణుగోపాల్, మండల వ్యవసాయాధికారి ఎస్.పద్మజ, శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు మాదగొని నరసింహ, మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి-మాచర్లకు రైలు

(3వ పేజీ తరువాయి)


ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయనతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ నియోజకవర్గంలోని శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల రిజర్వాయర్లు పూర్తిచేయడం లక్ష్యంగా నీటి పారుదలశాఖ అధికారులతో పలుమార్లు సమీక్ష నిర్వహించడంతో నిధులు విడుదలవుతున్నాయి. దీంతో ఈ ప్రాజెక్టులు పూర్తయితే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. దీంతోపాటు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇలా సాగునీరు అందుబాటులోకి వస్తుండటం, రవాణా మార్గాలు మెరుగు పడుతుండటంతో నియోజకవర్గం అభివృద్ధిబాట పడుతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే లైన్‌కు ఆమోదం తెలపడం హర్షణీయం

రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి-మాచర్ల రైల్వే లైన్‌కు ఆమోదం తెలపడం మంచి పరిణామం. రైల్వే లైన్ ఏర్పాటయితే దేవరకొండ, కల్వకుర్తి, నాగార్జునసాగర్ నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయి. అందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- గాజుల రాజేష్, దేవరకొండ

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0
***
ANDHRAJYOTHY



నల్లగొండ
3
శనివారం 13 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.90 (311.7462)	1,00,979	1,00,979
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,137.95	633.70
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.587 (43.5968)	82,320	1,30,542

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



తిప్పర్తి వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి జాతీయరహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా కష్టాలు అలాగే..

యూరియా కోసం రైతుల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. సహకార సంఘాలు, ఎరువుల దుకాణాలు, రైతువేదికల వద్ద రైతులు యూరియా కోసం గంటల తరబడి లైన్లలో నిలబడుతున్నా ఫలితం దక్కడం లేదు. జిల్లాకు వచ్చిన యూరియా వచ్చినట్లే ఇస్తున్నా అవసరాలు తీరని పరిస్థితి నెలకొంది. ప్రతీ బస్తా రైతుకు చేరేలా మానిటరింగ్ వ్యవస్థ కొనసాగిస్తున్నామని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నా, బ్లాక్ మార్కెట్ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో యూరియా బ్లాక్ మార్కెట్ కట్టడికి పోలీస్‌శాఖ టాస్క్‌ఫోర్స్‌ను సైతం రంగంలోకి దించింది. యూరియా పక్కదారి పట్టకుండా రైతులకు టోకెన్ విధానంలో అందిస్తున్నామని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- ఆయకట్టుకు ఈ 10 రోజులే కీలకం
- పంపిణీలో ఇక్కట్లు ఎదురవకుండా టోకెన్ల విధానం
- ముందస్తు జాగ్రత్తలు లేకపోవడం వల్లే బ్లాక్‌మార్కెట్‌లో ఎరువులు
- రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్

జిల్లాలో వానాకాలం సీజన్‌లో పత్తి, వరి పంటలకు యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుంది. జిల్లాలో పత్తికి ప్రస్తుతం యూరియా వినియోగం పూర్తిగా తగ్గిపోగా, వరికి బోరుబావుల కింద, చెరువుల కింద సాగైన చోట్ల ఇప్పటికే యూరియా అవసరం తీరింది. సాగర్ ఆయకట్టు కింద నెలక్రితం వరినాట్లు పూర్తవడంతో వరికి యూరియా అందించాల్సిన దశ కొనసాగుతోంది. మరో 10 రోజుల వరకు ఆయకట్టులో యూరియా వినియోగం ఉంటుంది. అందుకే ప్రస్తుతం ఆయకట్టులో యూరియా కోసం రైతులు దుకాణాలు, సొసైటీల వద్ద నిరీక్షిస్తున్నారు. జిల్లాకు ఈ సీజన్‌లో అన్ని పంటలకు కలిపి సెప్టెంబరు నెలాఖరు నాటికి 70వేల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరం ఉంటుందని భావించగా, ఇప్పటికే 60వేల మెట్రిక్‌టన్నుల యూరియాను పంపిణీ చేశారు. ఈ నెలలో మిగిలిన 10వేల మెట్రిక్‌టన్నుల యూరియా కూడా వస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే జిల్లా అవసరాలకు ఇంకో 6వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియా అవసరమవుతుందని, అదనపు కేటాయింపు చేస్తే తప్ప రైతుల అవసరాలు తీరవనే అభిప్రాయం వెల్లడవుతోంది. జూన్, జూలై నెలల్లో యూరియా విక్రయాలపై నియంత్రణ లేకపోవడంతో జిల్లా కోటాలో వచ్చిన యూరియా సైతం ఏపీలోని సరిహద్దు జిల్లాలకు విక్రయించారని, అందుకే ప్రస్తుతం కొరత తీవ్రమైందని తెలుస్తోంది.

టోకెన్ల విధానం అమలు

జిల్లాలో యూరియా కోసం రైతుల ఆందోళనలు రోజురోజుకూ ఉధృతమవుతుండడంతో కలెక్టర్ సూచనల మేరకు వ్యవసాయాధికారులు

- మిగతా 6వ పేజీలో...

బ్లాక్‌మార్కెట్‌కు యూరియా..

రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత ఉన్నా జిల్లాలో అలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు, అందుబాటులో ఉన్న యూరియా అవసరమైన రైతులకే అందించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో ప్రస్తుతం యూరియా సరిపోక రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా జూన్, జూలై నెలల్లో యూరియా విక్రయాల్లో ఎలాంటి నియంత్రణలు పాటించలేదని, ఎవరు ఎంత అడిగితే అంత ఇచ్చారని, అందుకే బఫర్ స్టాక్ కరిగిపోవడమేగాక ఆ రెండు నెలల్లో జిల్లాలో సాగుకు అవసరమైన యూరియా కంటే దాదాపు రెట్టింపు వినియోగమైందని, అదనపు యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలిందని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం యూరియా అవసరం పెరగడం, సరఫరా లేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో యూరియా ధరలకు రెక్కలొచ్చాయని చెబుతున్నారు. ఇప్పుడు అనుసరిస్తున్నట్లే, సీజన్ ఆరంభం నుంచి రైతులకు అవసరమైన మేర యూరియా అందించి ఉంటే ఈ ఆందోళనలు, ధర్నాలకు ఆస్కారమే ఉండేది కాదని చెబుతున్నారు.

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

జిల్లాలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా నియంత్రించేందుకు పోలీస్‌శాఖ రంగంలోకి దిగింది. ఎస్పీ శరత్‌చంద్రపవార్ సూచనల మేరకు టాస్క్‌ఫోర్స్ విభాగం పోలీసులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి జిల్లాలో విస్తృతంగా ఎరువుల దుకాణాల తనిఖీలు నిర్వహించారు. నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, కొత్తపల్లి, గుర్రంపోడు ప్రాంతాల్లో పదికిపైగా ఎరువుల దుకాణాలను తనిఖీలు చేసి స్టాకుల వివరాలు పరిశీలించారు. గుర్రంపోడు, కొత్తపల్లిలో ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీకి మించి విక్రయించిన వారిపై కేసులు నమోదుచేశారు. గతంలోనూ శాలిగౌరారం, గుర్రంపోడు, నల్లగొండ రూరల్ మండలాల్లో ఎరువుల దుకాణాలపై కేసులు నమోదు చేయగా, తాజాగా శుక్రవారం మరో రెండు దుకాణాలపై కేసులు నమోదయ్యాయి

కల్వకుర్తి-మాచర్లకు రైలు

- ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం
- దేవరకొండకు మహర్దశ



దేవరకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నుంచి దేవరకొండ మీదుగా మాచర్లకు రైల్వే మార్గానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ రైల్వే లైన్ కోసం ఏళ్లుగా పట్టణవాసులు ఎదురుచూస్తుండగా, చివరికి కేంద్రం ఆమోదంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కల్వకుర్తి, దేవరకొండ మీదుగా మాచర్లకు 126కిలోమీటర్ల మేర రైల్వే మార్గానికి రూ.2,520కోట్లతో ఏర్పాటుచేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 11న రైల్వేశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలోని పలు రైల్వే లైన్లతోపాటు కల్వకుర్తి-మాచర్ల రైల్వే లైన్ కూడా మంజూరుచేస్తున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించారు.

దేవరకొండకు మహర్దశ

దేవరకొండ మీదుగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేన్ల జాతీయ రహదారికి, తాజాగా రైల్వే మార్గం ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో వ్యాపార, రవాణాపరంగా అభివృద్ధి చెందనుంది. జడ్చర్ల-కోదాడ, వయా దేవరకొండ మీదుగా ఎన్‌హెచ్-167 విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఆమోదం తెలిపింది. 219 కిలోమీటర్ల మేర నాలుగు లేన్లుగా ఈ రోడ్డును ఏర్పాటు చేయనున్నారు. 2028 నాటికి ఇది పూర్తికానుంది. నాలుగు లేన్ల జాతీయ రహదారి మంజూరుతోపాటు కల్వకుర్తి నుంచి దేవరకొండ మీదుగా మాచర్లకు రైల్వే లైన్ ఏర్పాటుకానుండటంతో దేవరకొండ అభివృద్ధి చెందుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

- మిగతా 6వ పేజీలో...

రైల్వే లైన్ ఏర్పాటయితే అభివృద్ధి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు పర్యాయాలు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించడంతో రైల్వే లైన్లకు ఆమోదం తెలిపింది. కల్వకుర్తి వయా దేవరకొండ మీదుగా మాచర్లకు రైల్వేలైన్ నిర్మాణాన్ని కేంద్రం ఆమోదించింది. నిధులు సైతం కేటాయించినట్టు తెలిపింది. త్వరగా సర్వే నిర్వహించి రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలి. రైల్వే లైన్ ఏర్పాటులో సీఎం రేవంత్‌రెడ్డి కృషి ఎంతో ఉంది.

- బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

నెరవేరనున్న కల

దేవరకొండ నుంచి రాయచూరు, జడ్చర్ల, మాచర్లకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని 30 ఏళ్లుగా ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత జైపాల్‌రెడ్డి, ప్రస్తుత శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో ఈ రైల్వే లైన్ విషయాన్ని పలు పర్యాయాలు పార్లమెంట్‌లో ప్రస్తావించారు. రైల్వే లైన్ ఏర్పాటు కోసం వీరితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి సైతం పలు పర్యాయాలు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరగా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజా శ్రేయస్సే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని నర్సిరెడ్డిగూడెంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రూ.11.35కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులకు ఇలా త్రిపాఠితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామస్థాయిలో గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న నర్సిరెడ్డిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమస్య పరిష్కారం కావడం సంతోషంగా ఉందన్నారు. 257 మంది నిర్వాసితులకు ప్లాట్లు కేటాయించామని, మిగిలిన 37 మందికి త్వరలో కేటాయిస్తామన్నారు. శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయిర్ కింద ముంపు గ్రామాలైనా నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకపల్లి తండాల్లో సుమారు 289 మంది నిర్వాసితులకు ప్లాట్లతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమాణారెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలు, ఎంపీడీవో సుజాత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, ఎరుకుల వెంకటయ్య గౌడ్, నాయకులు కొండూరి పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ స్థలం పరిశీలన

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొల్ముంతలపహాడ్ గ్రామపంచాయతీ సర్వే నెం.202లో 25ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల కోసం స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రూ.200కోట్లతో పాఠశాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్నట్టు తెలిపారు. వారి వెంట తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ నేత దొంతినేని వెంకటేశ్వర్‌రావు, తదితరులు ఉన్నారు.

15న 'ప్రజావాణి' రద్దు : కలెక్టర్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ఈ నెల 15న సోమవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న గవర్నర్ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. దీంతో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దుచేశామని, ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ ఉండాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నల్లగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రైవేట్ స్కూల్ బస్సుకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ ఉండాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉదయాదిత్య భవనంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల బస్సులకు అర్హులైన డ్రైవర్ల నియామకం చేపట్టాలన్నారు. విద్యార్థులు బస్సుల్లో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రతలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో బొల్లారం భిక్షపతి, డీటీసీ శ్రీవాణి, డీటీవో లావణ్య, పాల్గొన్నారు.

ఆర్టీసీలో గిఫ్ట్ ఏ బస్ ట్రావెల్

- 'యాత్రాదానం' పేరుతో వినూత్న సేవా కార్యక్రమం
- దాతల సహకారంతో యాత్రలు చేపట్టేలా కార్యాచరణ
- రీజియన్‌లో ఏడు డిపోల పరిధిలో అమలుకు ఏర్పాట్లు



నల్లగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యత, సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్టీసీ 'యాత్రాదానం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆర్టీసీలో ఇటీవల ప్రవేశపెట్టిన పలు టూర్ ప్యాకేజీలు విజయవంతమైన నేపథ్యంలో ప్రత్యేకంగా దాతల కోసం యాత్రాదానం అనే సరికొత్త పథకాన్ని తీసుకువచ్చింది. ముఖ్యంగా పుట్టిన రోజులు, వివాహ మహోత్సవాలు, పండుగలు, ఇతర శుభ కార్యక్రమాలకు, నిరుపేద విద్యార్థులకు విజ్ఞాన యాత్రలకు, పుణ్య క్షేత్రాలకు వెళ్లే భక్తులకు 'యాత్రాదానం' చేసేలా కార్యక్రమాన్ని రూపొందించారు. అదేవిధంగా నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులను పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహార యాత్రలకు తీసుకెళ్లేందుకు దాతలు ముందుకు వచ్చి ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకోవచ్చు. ఈ పథకం నిర్వహణకు సంస్థ ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేసింది. దాతలు ముందుకు వచ్చి ఆయా డిపోల మేనేజర్లను కలిస్తే సంబంధిత యాత్రాదానం పథకం గురించి తెలియజేస్తారని ఉన్నతాధికారులు తెలిపారు.

రీజియన్ పరిధిలో అమలు

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, యాదగిరిగుట్ట డిపోల్లో అమలుచేయనున్నారు. ఆర్టీసీ ప్రత్యేకంగా 'గిఫ్ట్ ఏ బస్ ట్రావెల్' పథకాన్ని రూపొందించింది. దీన్ని దాతలు ఏ సందర్భంలోనైనా వినియోగించుకోవచ్చు. ప్రధానంగా ప్రైవేట్ సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్‌ఆర్‌ఐలు లేదా ఉమ్మడి కుటుంబాలు ఎవరైనా దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టే అవకాశాన్ని ఆర్టీసీ కల్పించింది. దాతలు డబ్బును సంస్థకు విరాళంగా అందజేస్తే సంస్థ బస్సు నదుపాయాన్ని కల్పిస్తుంది. ఎవరైనా నిరుపేదలు యాత్రకు వెళ్లాలంటే డబ్బు లేకుంటే దాతలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమం ద్వారా వారికి అవకాశం కల్పించవచ్చు. దాతలు ఇవ్వాల్సిన మొత్తాన్ని సంస్థకు సంబంధించిన యాత్రాదానం నిధి ప్రత్యేక కార్పొరేట్ ఖాతాలో జమ చేస్తారు. అదేవిధంగా టీజీఎస్‌ఆర్టీసీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ బదిలీతో పాటు క్యూఆర్ కోడ్, యూపీఐ చెల్లింపులు కూడా చేయవచ్చు. దాత (స్పాన్సర్) పేరు మీద జారీ చేసిన అధికార వెబ్‌సైట్ ద్వారా దాతలు నగదు రశీదును కూడా పొందవచ్చు. అదేవిధంగా టీజీఎస్‌ఆర్టీసీ పోర్టల్ ద్వారా కృతజ్ఞతగా స్పాన్సర్‌లకు ప్రయాణానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను కూడా అందజేస్తుంది. ఈ ప్రయాణాన్ని ఉపయోగించుకోవడానికి 36సీట్లు ఉన్న ఏసీ బస్సులు, 34సీట్లు ఉన్న సూపర్ లగ్జరీలు, 40సీట్లు ఉన్న డీలక్స్ బస్సులను, 50సీట్లు ఉన్న ఎక్స్‌ప్రెస్‌లను ఆర్టీసీ దాతలకు సమకూరుస్తుంది. దాతలు ట్రిప్పుకు సంబంధించి కనీసం ఏడు రోజుల ముందు సమాచారం ఇవ్వాలని అధికారులు పేర్కొంటున్నారు.

దాతలు సద్వినియోగం చేసుకోవాలి

ఆర్టీసీ చేపట్టిన ఈ వినూత్న సామాజిక కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్‌ఆర్‌ఐలు, అసోసియేషన్‌లు, ఎన్జీవోలు సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలి. సామాజిక బాధ్యతల పరంగా యాత్రాదానం పథకాన్ని చేపట్టడం జరిగింది. అదేవిధంగా ప్రైవేట్ సంస్థలు, ఉమ్మడి కుటుంబాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని దాతృత్వ భావంతో సహకరించాలి. ఈ కార్యక్రమాన్ని రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో అమలుచేస్తున్నాం.

కె.జానిరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం

మతాలు, కులాల మధ్య బీజేపీ చిచ్చు



- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్
- వల్లాలలో అమరుల స్మారక పైలాన్ ఆవిష్కరణ

శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో అమరుల స్మారక పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేతలు వీహెచ్, జానారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు సామేలు, వేముల వీరేశం, తదితరులు

4

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భిక్షంగౌడ్



పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా నాయకులు

నల్లగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుంకరి భిక్షంగౌడ్ ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పీఆర్టీయూ భవనంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భిక్షంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భిక్షంగౌడ్ నల్లగొండ మండల అధ్యక్షుడిగా ఐదు పర్యాయాలు, జిల్లా అధ్యక్షుడిగా మూడు మార్లు, కార్యదర్శిగా మూడు పర్యాయాలు పని చేసి సంఘం అభివృద్ధికి కృషి చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేసి గుర్తింపు పొందారు. కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన భిక్షంగౌడ్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి, కార్యదర్శి జాన్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు పణికుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి అద్దంకి సునిల్, ఆర్‌సి.రెడ్డి, పరీద్, రవిశంకర్‌గౌడ్, వీరమల్ల శ్రీనివాస్‌గౌడ్, నాగయ్య, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా నర్సింహారెడ్డి, తదితరులు

సాయుధ పోరాటాన్ని వక్రీకరించేందుకు బీజేపీ కుట్ర

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

డిండి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డిండి మండలకేంద్రంలో కమ్యూనిస్టు ఉద్యమకారులు, అమరులు కృష్ణశర్మ, ఎలిమినేటి పెద్దయ్య, చింతకుంట్ల వెంకటయ్య స్మారకస్తూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయధ పోరాటం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన మహోత్తర సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి, మోయినుద్దీన్, దొడ్డి కొమరయ్య నాయకత్వం వహించారన్నారు. పోరాట ఫలితంగా 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిందని అన్నారు. సాయుధ పోరాటానికి సంబంధంలేని మతోన్మాదులు వారికి అనుకూలంగా చరిత్రను మలుచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశభక్తులుగా చలామణి అవుతూ రాజ్యాంగాన్ని సవరిస్తూ దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు యత్నిస్తున్న బీజేపీ కుట్రను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం దొరలు, భూస్వాములు, పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాట వారోత్సవాలు ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, టి.బుచ్చిరెడ్డి, శ్రీరామదాసు కనకచారి, ఎండి.మోయినుద్దీన్, టి.విజేందర్‌రెడ్డి, శైలేజ్, నూనె వెంకటేశ్వర్లు, సోమిడి శ్రీనయ్య, కేశవులు, దుబ్బ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న కోర్టుకు అన్ని వివరాలు సమర్పిస్తా : ఎంపీడీవో

దామరచర్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దిలావర్‌పూర్ పంచాయతీ కార్యదర్శికి సంబంధించిన జీతం సర్టిఫికెట్ వివరాలను ఈ నెల 19వ తేదీన కోర్టుకు సమర్పిస్తానని ఎంపీడీవో అలివేలు మంగ అన్నారు. శుక్రవారం ఆమె కార్యదర్శి శ్రీనివాసచారికి సంబంధించిన కేసుపై వివరణ ఇచ్చారు. కార్యదర్శికి ఇద్దరు భార్యలు ఉన్నారని, వారిలో ఎవరికి సర్టిఫికెట్ ఇవ్వాలనే విషయంపై కోర్టుకు తెలిపి ఎంపీడీవో కార్యాలయంలో పని ఉండటం వల్ల హాజరు కాలేకపోయారని అన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

త్రిపురారం సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంపసాగర్ గ్రామానికి చెందిన బోల్లెంపల్లి వెంకయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మండల కాంగ్రెస్ నాయకుడు కొండ భాస్కర్ శుక్రవారం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేలు, 50కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పరంగి నాగరాజు, యల్లావుల మహేష్, సైదులు, యాదగిరి, సైదులు, వెంకన్న, కరుణాకర్, నాగేందర్, కృష్ణ, బాబు, కోటయ్య, శ్రీను, సైదులు, జానయ్య, రవి పాల్గొన్నారు.



మల్లీశ్వరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జానారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

భార్గవ్‌ను పరామర్శించిన జానారెడ్డి

● మల్లీశ్వరమ్మ అంత్యక్రియలకు హాజరైన ప్రముఖులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంలో ఉన్న మునిసిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్‌ను సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి పరామర్శించారు. భార్గవ్ తల్లి మల్లీశ్వరమ్మ బుధవారం మృతి చెందగా, జానా ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించి, భార్గవ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మల్లీశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. శుక్రవారం జరిగిన మల్లీశ్వరమ్మ అంత్యక్రియలకు రాజకీయ నేతలు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మల్లీశ్వరమ్మ పాడె మోశారు. కార్యక్రమాల్లో నాయకులు స్కైలాబ్‌నాయక్, చిట్టిబాబునాయక్, గుండా నాగరాజు, ఉదయభాస్కర్, వరుణ్, విజయభాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి

వేములపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కులమతం లేని సమాజం కోసం నిరంతరం పాటుపడిన కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి ఆశయ సాధనకు నేటి యువతరం కృషి చేయాలని మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లడుతూ ప్రజలందరికీ ఒకే రకమైన న్యాయం జరగాలని, అందరు సమానంగా ఉండాలని కోరుకున్న గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు. కార్యక్రమంలో మండల నాయకులు వడ్డెగాని సైదులు, పుట్ట రేనయ్య, అనిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాధవి, నాగమణి, వెంకటేశ్వర్లు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



మాడ్గులపల్లిలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఏచూరి

మాడ్గులపల్లి: కమ్యూనిస్టు పార్టీకి ఎనలేని సేవ చేసిన సీపీఎం మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీకర్, వెంకటాచారి, నాగయ్య, వెంకటయ్య, నారాయణరెడ్డి, నాగయ్య, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లౌకికవాదమే లక్ష్యంగా పనిచేసిన సీతారాం

తిరుమలగిరి(సాగర్): దేశంలో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా లౌకికవాదాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా సీపీఎం మాజీ జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి పనిచేశారని ఆ పార్టీ మండల కార్యదర్శి జటావత్ రవినాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఏచూరి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో ఆయన లేని వెలితి స్పష్టంగా ఉందన్నారు. ఆయన మన మధ్య లేకపోయినా పార్టీని బలోపేతం చేసి ఏచూరీ ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు షేక్ చాంద్‌పాషా, ఎస్ఎఫ్ఐ నాయకులు నల్లబెల్లి జగదీష్, గ్రామపంచాయతీ వర్కర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



వేములపల్లి: ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో తరి రాము

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పెద్దవూర, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో తరి రాము అన్నారు. మండలంలోని వెల్మగూడెం గ్రామంలోని సెయింట్ థామస్ పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెద్దవూర మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని పది పాఠశాలల నుంచి 500కు పైగా విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడాంశాల్లో అండర్-14, 17 స్థాయిల్లో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు డాక్టర్ ఎన్స్ థామస్ మెమోరియల్ వారు అందించిన షీల్డ్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, మండల కార్యదర్శి శోభారాణి, గెజిటెడ్ హెచ్ఎంలు సుదర్శన్, శ్రీనివాస్, సెయింట్ థామస్ పాఠశాల ప్రిన్సిపాల్ మార్టిన్, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



మాడ్గులపల్లిలో యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు

● తోపులాటలో మహిళా రైతుకు గాయాలు

మాడ్గులపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం అన్నదాతలు రోడ్డెక్కారు. సకాలంలో యూరియా అందించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘానికి యూరియా వచ్చిందన్న సమాచారంతో అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. యూరియా సరిపడా లేకపోవడంతో కొంతమందికే ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆగ్రహించిన రైతులు అద్దంకి - నార్కట్‌పల్లి రహదారిపై బైఠాయించారు. దీంతో అరగంట పాటు ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణయ్య అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి సముదాయించారు. దీంతో ట్రాఫిక్ జామ్ లేకుండా వాహనాలు రాకపోకలు కొనసాగించాయి. యూరియా ఇచ్చే సమయంలో రైతులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో ఇందుగుల గ్రామానికి చెందిన కామళ్ల ఎల్లమ్మకు చేతికి గాయాలయ్యాయి. గమనించిన స్థానిక రైతులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆమెను నల్లగొండ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

యూరియా సకాలంలో పంపిణీ చేయాలి

దామరచర్ల: అక్రమాలకు తావు లేకుండా రైతులకు యూరియాను ఎమ్మార్పీ ధరకు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని పీఏసీఎస్ వద్ద శుక్రవారం ఆయన క్యూలో నిలబడిన రైతులతో మాట్లాడారు. శుక్రవారం తెల్లవారుజామున దామరచర్లకు నాలుగు లారీ లోడ్ యూరియా వచ్చినందున మండల రైతులందరికీ సరిపడా అందించాలన్నారు. కేంద్రప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్రాలకు సరిపడా యూరియా సరఫరా చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. రానున్న రోజుల్లో రైతులు బీజేపీకి బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జమ్మల కోటయ్య, లక్ష్మయ్య, జానకి రాములు, సైదానాయక్, వినయ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను

విజయవంతం చేయాలి

● సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

దేవరకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఈనెల 26, 27 తేదీల్లో జరగనున్న సీఐటీయూ నల్లగొండ జిల్లా 10వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. దేవరకొండ టీటీడీ కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందని అన్నారు. 1970లో ఏర్పాటైన సీఐటీయూ దేశవ్యాప్తంగా కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేసి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకుడు ఎరుకల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, బిజిలి లింగయ్య, యాదగిరి, వెంకటేష్, పుష్పలత, జ్యోతి, ముత్యాలు పాల్గొన్నారు. అనంతరం సీఐటీయూ నూతన మండల కన్వీనర్‌గా రహీంను నియమించినట్లు ఆయన ప్రకటించారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

డిండి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కోతకు గురైన తవక్లాపూర్, నగరదుబ్బతండా మధ్య ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనమళ్ల నవీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రహదారి దెబ్బతినడం వల్ల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని కోరారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు స్కూల్ బస్సులు నిత్యం ఈ రోడ్డు మార్గాన వెళ్తుంటారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎలిమినేటి నరేష్, ఆదిల్, కడారి అంజి, నూనె నాగరాజు, నూతనకంటి అంజి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం సాగర్ అర్బన్ కమిటీ

నాగార్జునసాగర్,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం సాగర్ అర్బన్ శాఖ నూతన కమిటీని శుక్రవారం సాగర్‌లో ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు జిల్లా సెక్రటరీ శ్రీశైలం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడిగా పల్‌రెడ్డి నర్సింహారెడ్డి, కార్యదర్శిగా నెలకుదిటి సాంబశివరావు, కోశాధికారిగా వి.నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులుగా సీతా కల్యాణి, కేశవరెడ్డి, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా నారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఈశ్వరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాలాజీ, పబ్లిసిటీ సెక్రటరీగా సరోజినిదేవిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు ఆంజనేయులు, యుగేంధర్‌రెడ్డి, గురవయ్య పాల్గొన్నారు.

దాతల సహకారంతో ప్యూరిఫైర్ ఏర్పాటు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈదులగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, దాతల సహకారంతో వాటర్ ప్యూరిఫైర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం లాలు మాట్లాడుతూ విద్యార్థుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు పాఠశాల ఉపాధ్యాయులు కొనకంచి వెంకటేశ్వర్లు, ఆర్.లక్ష్మి, ఎం.జ్యోతి ముందుకు రావడం హర్షణీయమన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు మరో పన్నెండు మంది చిరు దాతలను సంప్రదించి రూ.65వేలతో వాటర్ ప్యూరిఫైర్‌ను ఏర్పాటు చేయడం ఆదర్శనీయమన్నారు. అందరి సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం ప్యూరిఫైర్ ఏర్పాటుకు సహకరించిన దాతలు కరుణాకర్‌రెడ్డి, మదార్, కోటిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సక్కుబాయి, యశ్వంత్‌రెడ్డి, అర్జున్, లక్ష్మమ్మ, సాయినందన్, సంధ్య, శ్రీనివాసరెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ధర్మానాయక్, మంగ్యానాయక్, కవిత, రత్నకుమారి, శ్రీదేవి, మహిత, సైదులు పాల్గొన్నారు.

కల్వకుర్తి - మాచర్లకు రైలు

(3వ పేజీ తరువాయి)

ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయనతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ నియోజకవర్గంలోని శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల రిజర్వాయర్లు పూర్తిచేయడం లక్ష్యంగా నీటిపారుదలశాఖ అధికారులతో పలుమార్లు సమీక్ష నిర్వహించడంతో నిధులు విడుదలవుతున్నాయి. దీంతో ఈ ప్రాజెక్టులు పూర్తయితే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. దీంతోపాటు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇలా సాగునీరు అందుబాటులోకి వస్తుండటం, రవాణా మార్గాలు మెరుగు పడుతుండటంతో నియోజకవర్గం అభివృద్ధిబాట పడుతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే లైన్‌కు ఆమోదం తెలపడం హర్షణీయం

రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి-మాచర్ల రైల్వేలైన్‌కు ఆమోదం తెలపడం మంచి పరిణామం. రైల్వే లైన్ ఏర్పాటయితే దేవరకొండ, కల్వకుర్తి, నాగార్జునసాగర్ నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయి. అందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- గాజుల రాజేష్, దేవరకొండ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఉప్పు సురేష్, ఎస్ఐ



మండలంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే చర్యలు తప్పవని నిడమనూరు ఎస్ఐ ఉప్పు సురేష్ హెచ్చరించారు. దొంగతనాల నివారణ, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, వాహనాల తనిఖీల గురించి ఆయన మాట్లాడారు.

(నిడమనూరు, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి?

ఎస్ఐ: మండలంలో శాంతిభద్రతలు పదిలంగా ఉన్నాయి. ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. నేరాల అదుపు, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: మండలంలో దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ: చోరీలు జరగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. రాత్రివేళల్లో పోలీసుసిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ట్రాఫిక్ సమస్యపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా రోడ్లపై వాహనాలు నిలిపితే హెచ్చరించడమే కాకుండా కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రైవేట్ వాహనాల తనిఖీల గురించి?

ఎస్ఐ: వాహనాల తనిఖీలు నిత్యం నిర్వహిస్తున్నాం. బ్రీత్ అనలైజర్ పరీక్షలు కూడా చేస్తున్నాం. అవసరమైన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలకు జరిమానా విధిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు తిరుగుతున్నాయి కదా?

ఎస్ఐ: నిబంధనలపై ఆటోవాలాలకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పరిమితికి మించి జనాలను ఎక్కించుకోవడంతో పాటు అతి వేగంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటున్నాం.

కాలానుగుణంగా బోధనలో మార్పులు రావాలి



సాంఘికశాస్త్ర శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

వేములపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యాబోధనలో మార్పులు తీసుకొస్తూ ఉత్తమమైన బోధనలు అందించాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బూరుగు రమేష్ అన్నారు. మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సాంఘికశాస్త్ర యుపీ లెవల్ శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ పేద విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులయ్యే విధంగా పనిచేయాల్సిన బాధ్యత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు తీసుకున్న ఉపాధ్యాయులను సాంఘికశాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సాంఘికశాస్త్రం ఫోరం అధ్యక్షుడు నల్లమేకల వెంకయ్య, నర్సింహనాయక్, తిరుపతి, రహీం, ప్రభాకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సైదులు, కల్పన, సరిత, పద్మ, వీరనారాయణ, సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

చేయూతనందించడం అభినందనీయం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు దాతలు చేయూతనందించడం అభినందనీయమని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండలంలోని శెట్టిపాలెం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం గ్రామానికి చెందిన సీహెచ్.మాధవరెడ్డి నోట్‌బుక్స్, పెన్నులు, కంపాక్స్ బాక్స్‌లు అందజేశారు. వాటిని విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పల్లా వీరయ్య, కందిమళ్ల సుధాకర్‌రెడ్డి, వెంకటయ్య, అశోక్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

మిర్యాలగూడటౌన్: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని బకాల్‌వాడీ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న విద్యావిధానాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, బట్టీ విధానానికి స్వస్తి పలికి ప్రాజెక్టులు రూపొందించాలని సూచించారు. పాఠశాలకు పదోన్నతిపై వచ్చిన గణిత అధ్యాపకులు నాగమణి, జ్యోతిలక్ష్మి, శ్రీనునాయక్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్పీలు కృష్ణకాంత్‌నాయక్, సైదిరెడ్డి, పండిత్‌రెడ్డి, రాంరెడ్డి, తావుర్యా పాల్గొన్నారు.

యూరియా కష్టాలు అలాగే..



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తోన్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

(3వ పేజీ తరువాయి)

యూరియా పంపిణీకి కట్టుదిట్ట కార్యాచరణ చేపట్టారు. జిల్లాకు వచ్చే యూరియాను సహకారసంఘాలు, ఎరువుల దుకాణాలతో పాటు, రైతువేదికల వద్ద విక్రయించేలా ఆదేశాలిచ్చారు. సహకార సంఘాలు, రైతువేదికల వద్ద ఏఈవోలు (వ్యవసాయవిస్తరణ అధికారి), ప్రైవేట్ ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల వద్ద మండల వ్యవసాయాధికారుల సమక్షంలో టోకెన్లు జారీ చేసి ఎరువులు పంపిణీచేస్తున్నారు. ఆయా క్లస్టర్ల పరిధిలో ఏ రైతుకు ఎంత అవసరమో గుర్తించి అంతవరకేయూరియా కేటాయిస్తూ టోకెన్లు జారీ చేస్తున్నారు. ప్రైవేట్ దుకాణాల వద్ద సైతం ఏవోలు జారీ చేసిన టోకెన్లకు మాత్రమే యూరియా ఇస్తున్నారు. అయినా యూరియా సరిపోవడం లేదని, యూరియా వచ్చినా పంపిణీ చేయడం లేదని పేర్కొంటూ రైతులు శుక్రవారం తిప్పర్తి, మిర్యాలగూడ, చందంపేట తదితర ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు. శుక్రవారం మిర్యాల గూడలోని ర్యాక్ పాయింట్‌కు 2,639 మెట్రిక్‌టన్నుల యూరియా రాగా, అందులో జిల్లాకు 1,800 మెట్రిక్‌టన్నులు కేటాయించారు. సాగర్ ఆయకట్టులో మి ర్యాలగూడ డివిజన్‌కు 1,000మెట్రిక్ టన్నుల కోటా ను కేటాయించారు. ఈ స్టాక్ మొత్తాన్ని ఎనిమిది పీఏసీఎస్‌లకు 470మెట్రిక్‌టన్నులు, మిగతా 520 మెట్రిక్ టన్నుల యూరియాను 29 ప్రైవేటు డీలర్లతోపాటు మూడు రైతు ఆగ్రోసేవా కేంద్రాలు, ఎనిమిది నాగార్జున కోఆపరేటివ్ సొసైటీలకు కేటాయించారు.

బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు

- శరత్‌చంద్ర పవార్, ఎస్పీ



యూరియా పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఎక్కడైనా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటాం. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు కొనసాగుతాయి. యూరియాను ఎమ్మార్పీకి మించిన ధరలకు విక్రయించినా, అక్రమంగా నిల్వలు చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తాం. అక్రమ నిల్వలు, విక్రయాల విషయం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. జిల్లాలో ప్రైవేట్ ఎరువుల దుకాణాల నిర్వాహకులు విక్రయాల్లో పారదర్శకత పాటించాలి. దుకాణాల వద్ద స్టాక్ వివరాలను ప్రదర్శించాలి.

ప్రతీ బస్తా రైతుకే చేరేలా పంపిణీలో నియంత్రణ



జిల్లాలో యూరియా పంపిణీలో అవతవకల కు ఆస్కారం లేకుండా టోకెన్ల విధానం అమలు చేస్తున్నాం. ఏఈవోలు ధ్రువీకరించిన మేరకే రైతులకు టోకెన్లు జారీ చేస్తున్నాం. సహకారసంఘాలకు కేటాయించే యూరియా పంపిణీలో ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు వాటికి అనుబంధంగా మరో 29 రైతువేదికల వద్ద యూరియా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం. శుక్రవారం కూడా జిల్లాలో 11 రైతువేదికల వద్ద యూరి యా పంపిణీచేశాం. ప్రైవేట్ డీలర్ల వద్ద సైతం యూరియా లారీ రాగానే ఏవో పర్యవేక్షణలోనే రైతులకు టోకెన్ల ద్వారా యూరియా అందిస్తున్నాం. జిల్లాకు కేటాయించిన యూరి యా ఒక్క బస్తా కూడా పక్కదారి పట్టకుండా చూస్తున్నాం.

- పి.శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి